

రేషన్ మాఫియా విజిలెన్స్ అధికారుల అండదండలతో బరితెగిస్తోంది. ఏకంగా గన్నీ బ్యాగులతోనే రేషన్ బియ్యం యథేచ్ఛగా తరలించేస్తోంది. ఎక్కడైనా పట్టుబడితే అసలు అవి రేషన్ బియ్యమే కాదని కోర్టులకెళ్లి వాదిస్తోంది. ఆ తర్వాత బ్యాంకు గ్యారంటీలు కట్టి ఆ బియ్యం మళ్లీ దర్జాగా స్వాధీనం చేసుకుని అనుకున్న చోట అమ్ముకుని సొమ్ము చేసుకుంటోంది.

# గన్నీలతో ఎత్తేస్తున్నారు!



## రేషన్ మాఫియా బరి తెగింపు

**విజిలెన్స్ అధికారుల అండదండలతో యథేచ్ఛగా వ్యాపారం**

- పట్టుకుంటే.. రేషన్ బియ్యం కాదని కోర్టుకెళుతున్నారు
- బ్యాంకు గ్యారంటీలు కట్టి ఆ బియ్యం మళ్లీ స్వాధీనం

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** ఇంటింటికీ నిత్యావసరాల పంపిణీ రోజున ఎండీయూ ఆపరేటర్లు నిర్దేత పరిమాణం కంటే తక్కువగా బియ్యం బస్తాలను డీలర్ల దగ్గర నుంచి తీసుకువెళుతున్నారు. నిత్యావసరాల పంపిణీలో ఎండీయూ ఆపరేటర్లకు కార్డుదారులు ఎంతమంది బియ్యం అమ్ముతుంటారన్నది అవగాహన ఉంది. దీంతో ముందస్తుగా ఆ పరిమాణం మేరకు డిపోలలోనే బియ్యం గన్నీ బ్యాగులను ఉంచేస్తున్నారు. లూజుగా పెట్టుకున్న బియ్యాన్ని కాటాలో తూచి కార్డుదారులకు ఇచ్చినట్టుగా ఈ పోస్‌లో నమోదు చేస్తున్నారు. డీలర్ల దగ్గర ఉంచిన గన్నీ బ్యాగులు నేరుగా అక్రమ బియ్యం వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. గతంలో పేదల బియ్యం లూజుగా వెళ్లేవి. ప్లాస్టిక్ సంచులలో, పాలిథీన్ సంచులలోనో వెళ్లేవి. సివిల్ సప్లయిస్ అధికారులు, పోలీసుల దాడులలో పట్టుబడినపుడు వీటిలోనే కనిపించేవి. ఇప్పుడలా కాదు. ఏకంగా సీలు తీయని గన్నీ బ్యాగులే నేరుగా రవాణా అవుతున్నాయి. ఇటీవల కాలంలో నగర పరిధిలోనూ, జిల్లా పరిధిలోనూ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నపుడు గన్నీ బ్యాగులే దొరికాయి. రేషన్ మాఫియా ఎంతగా బరి తెగించి రెచ్చిపోతుందన్నదానికి ఇవే నిదర్శనాలు.

### గన్నీ బ్యాగుల్లో యథేచ్ఛగా సరఫరా

నగరంలో సర్కిల్ - 3లో శివ ప్రసాద్ అనే అక్రమ బియ్యం వ్యాపారిని పటమట పోలీసులు రెండు సార్లు పట్టుకున్న సందర్భంలో కూడా గన్నీ బ్యాగులే దొరికాయి. అక్టోబరులో సర్కిల్ - 1 కు చెందిన ఓ బడా రేషన్ మాఫియా డాన్‌కు చెందిన బియ్యం బస్తాలు దొరికినపుడు కూడా గన్నీ బ్యాగులతో ఉన్న బస్తాలే ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరిటాల రేషన్ మిల్లులో తనిఖీల సందర్భంలో గన్నీ బ్యాగులతో కూడిన అక్రమ బియ్యమే దొరికింది. ఆ రోజున మంత్రి రావటంతో ఆయన కన్నుగప్పి ట్యాగ్‌లను తొలగించి కాల్చివేశారు. ఈ వ్యవహారం మంత్రి దృష్టికి రాలేదు. ట్యాగ్‌ల ద్వారా అవి ఏ మిల్లు నుంచి వచ్చాయో తెలిసిపోతుంది. ట్యాగ్‌లను కాల్చివేయటం వల్ల నిజాన్ని కప్పిపెట్టారు.

### సర్కిల్ - 1 డాన్‌కే బియ్యం విక్రయం

విజయవాడలోని రేషన్ డీలర్లంతా కూడా నగరంలోని సర్కిల్-1 డాన్‌కే బియ్యాన్ని విక్రయిస్తున్నారు. ఎందుకంటే

మిగతా 6లో..



తోట్లవల్లూరు మండలంలో ఆరబెట్టిన ధాన్యం

# అన్నదాతకు తుఫాన్ ముప్పు

*తుఫాన్ ముప్పు రైతులను వణికిస్తోంది. వరికోతలు ముమ్మరంగా సాగుతున్న వేళ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బుధవారం నాటికి తుఫాన్‌గా మారుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. తుఫాను ప్రభావంతో కోస్తాతీరం వెంబడి డిసెంబరు 1వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. మంగళవారం ఆకాశంలో మబ్బులు కమ్మి ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియనిస్థితిలో ఉండటంతో పంటను కాపాడుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. గతేడాది డిసెంబరు 1వ తేదీ నుంచి మిచౌంగ్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో పంటలు దెబ్బతిని, రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది నాలుగురోజుల ముందుగానే తుఫాన్ హెచ్చరికలు వెలువడటంతో రైతులకు దిక్కుతోచడం లేదు.*

## రానున్న 4 రోజులపాటు కోస్తాతీరంలో భారీ వర్షాలు

### పొలాల్లోని ధాన్యం కాపాడుకునేందుకు రైతుల తంటాలు

- ధాన్యం రవాణాకు వాహనాలు అందుబాటులో ఉంచడంలేదని ఫిర్యాదు
- కంకిపాడు మండలంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటన

**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం :** జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 1.65 లక్షల హెక్టార్లలో వరి సాగు చేశారు. కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు, గన్నవరం, తోట్లవల్లూరు, మొవ్వ, మచిలీపట్నం, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గుడ్లవల్లేరు తదితర మండలాల్లో వరికోతలు ఇప్పటికే ముమ్మరంగా సాగుతున్నాయి. వ్యవసాయశాఖ అధికారులు వరికోతలను వాయిదా వేయాలని రైతులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను అలానే ఉంచితే, వర్షం కురిస్తే పైరు నేలవాలిపోతుందని, దీంతో మరింతగా నష్టపోతామనే భయంతో రైతులు ఉన్నారు. అందుబాటులో ఉన్న యంత్రాల ద్వారా కోతలు పూర్తి చేస్తున్నారు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో వరికోతలను రైతులు నిలిపివేశారు. కోతపూర్తయిన అనంతరం పొలంలో ఉన్న ధాన్యంను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో రైతులు ఉన్నారు. గత వారంరోజుల వ్యవధిలోనే 25 వేల హెక్టార్లలో వరి కోతలు పూర్తయ్యాయి. యంత్రాల ద్వారా వరికోతలు కోయించి ధాన్యం రహదారులపైకి, ఖాళీ జాగాల్లోకి తరలించి రాశులుగా పోసి పరదాలు, టార్పాలిన్‌లు కప్పి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రహదారులకు, డొంక రోడ్లకు దూరంగా ఉన్న పొలాల్లోని కొంతధాన్యం పొలాల్లోనే ఉంది. రైతుసేవాకేంద్రాలకు వెళితే సంచులు, వాహనాలు అందుబాటులో లేవని చెబుతున్నారని, మధ్యవర్తులకు ధాన్యం తక్కువ ధరకే విక్రయిస్తామని చెబితే మొవ్వ మండలంలో అప్పటికప్పుడు సంచులు, వాహనాలు సిద్ధంగా ఉంటున్నాయని రైతులు చెబుతున్నారు.



యంత్రాల ద్వారా వరికోతలు

### భారీవర్ష సూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం బుధవారం నాటికి తుఫాన్‌గా మారుతుందని, దీని ప్రభావంతో కోస్తాతీరం వెంబడి పలు ప్రాంతాల్లో ఏడు సెంటీమీటర్ల వరకు వర్షం కురవనుంది. 28, 29, 30 తేదీల్లో 12 సెంటీ మీటర్లు, డిసెంబరు 1వ తేదీన ఒకమోస్తరు వర్షం కురుస్తుందని వాతావరణశాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లవద్దని కూడా హెచ్చరించింది.

### 48 గంటల్లో రైతుల వద్ద ఉన్న ధాన్యం కొంటాం : మంత్రి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 48 గంటల వ్యవధిలో జిల్లాలో రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాశాఖ అధికారులను అందుబాటులో ఉంచి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రైతులు ధాన్యం విక్రయించే సమయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 4.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 24 గంటలు, 48 గంటల వ్యవధిలోనే రైతులకు ధాన్యం నగదును జమచేస్తున్నట్లు వివరించారు.

### కొనుగోళ్లు నిలిపివేసిన మిల్లర్లు

డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లుల వద్ద ధాన్యం నిల్వలు ఇప్పటికే అధికంగా ఉన్నాయి. దీంతో మిల్లర్లు ధాన్యం దించుకోవడంలేదు. యంత్రాలతో కోత పూర్తి చేసిన ధాన్యంలో 26 నుంచి 27 పాయింట్ల మేర తేమశాతం ఉంటోందని, ఈ ధాన్యం దించుకుంటే రెండు, మూడు రోజుల్లో రంగుమారడం లేదా మొలకలు వస్తాయనే కారణం చూపి డ్రయ్యర్ సౌకర్యం లేని మిల్లర్లు ధాన్యం దించుకోమని చెబుతున్నారు.
దీంతో ఇతర జిల్లాలకు చెందిన వ్యాపారులు బస్తా ధాన్యం రూ.1,350 నుంచి 1400లకు కొనుగోలు చేసి తరలించుకుపోతున్నారు.

### మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలన

కంకిపాడు మండలం కోలవెన్ను, దావులూరు తదితర గ్రామాల్లో మంగళవారం పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించారు. రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలులో ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గోనె సంచులు, ధాన్యం రవాణాకు సంబంధించి వాహనాలు అందుబాటులో ఉండటం లేదని రైతులు మంత్రి దృష్టికి తెచ్చారు. మధ్యవర్తులు బస్తా ధాన్యం రూ.1,350 నుంచి 1400లకే కొనుగోలు చేస్తున్నారని, ఈ ధరకు ధాన్యం విక్రయిస్తే తమకు బస్తాకు రూ. 325 నుంచి 350 వరకు నష్టం వస్తోందని వివరించారు. రైతులకు మిగిలే నగదు ఈ రూపంలో వదులుకోవాల్సి వస్తోందని తెలిపారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతుల వద్ద ఉన్న ధాన్యం పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరారు. వర్షం కారణంగా వరికోతలు ఆలస్యంగా కోస్తే బియ్యంలో నూకశాతం పెరుగుతుందని, ఈ తరహా ధాన్యం భవిష్యత్తులోనూ మద్దతు ధరకే కొనుగోలు చేయాలని యుగంధర్ అనే రైతు విజ్ఞప్తి చేశారు.

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

*జిల్లాలో ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తెలియజేసేందుకు పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు కార్యాలయంలో 82476 93551 నంబరుతో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జేసీ గీతాంజలిశర్మ తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పనిచేస్తుందని పేర్కొన్నారు.*

# పోలీసులపై గంజాయి బ్యాచ్ దాడి

- కస్టడీలోని స్నేహితులకు గంజాయి ఇస్తుంటే అడ్డుకున్నారని..
- కోర్టు ఆవరణలో ఘటన.. నివ్వెరపోయిన న్యాయవాదులు

**మచిలీపట్నం టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** స్నేహితులకు గంజాయి ప్యాకెట్లు ఇస్తుంటే అడ్డుకున్నారని పోలీసులపై గంజాయి బ్యాచ్ దాడి చేసిన ఘటన మచిలీపట్నంలో మంగళవారం సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే... నగరంలోని పోతేపల్లి, ఎన్టీఆర్ కాలనీ, రాజుపేట, ఉల్లింగిపాలెం, చిలకలపూడి, నవీన్‌మిట్టల్ కాలనీ తదితర ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్న వర్ధన్‌కుమార్, జగదీష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్తున్నారు. అయితే వీరితో పాటు గంజాయి విక్రయించే గుడివాడకు చెందిన కిరణ్, ఆర్‌పేటకు చెందిన బాకీచరణ్ కోర్టుకు వెళ్తున్న నిందితులకు గంజాయి పొట్లాలు ఇచ్చేందుకు ప్రయత్నించారు. దీన్ని పోలీసులు అడ్డుకుని వారించారు. దీంతో గంజాయి మత్తులో ఉన్న కిరణ్, బాకీ చరణ్ ముగ్గురు పోలీసులపై దాడికి దిగారు. సమాచారం అందుకున్న చిలకలపూడి సీఐ నబి వెంటనే సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని కిరణ్, బాకీ చరణ్‌లను అరెస్టు చేశారు. కేసు నమోదు చేశారు. కోర్టు ఆవరణలో పోలీసులపై గంజాయి బ్యాచ్ దాడి చేయడం చూసిన న్యాయవాదులు, కక్షిదారులు ముక్కున వేలేసుకున్నారు.

# విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు పునరుద్ధరణ

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ):** వరదల కారణంగా పలు చోట్ల ముంపునకు గురైన విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు పునరుద్ధరణ పనులను కాంట్రాక్టు సంస్థ మేఘా చేపట్టింది. బుడమేరు వరద కారణంగా గొల్లపూడి నుంచి సూరంపల్లి వరకు విజయవాడ వెస్ట్ బైపాస్ వరదలో చిక్కుకుంది. విజయవాడ వెస్ట్ బైపాస్‌కు భారీగా నష్టం జరగలేదు.. విజయవాడ వెస్ట్ బైపాస్‌కు సంబంధించి కాంట్రాక్టు సంస్థ మేఘా ముందుగానే ఇన్సూరెన్స్ చేయించటం వల్ల చిన్నపాటి డ్యామేజీలకు ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చాయి. దీంతో దెబ్బతిన్న ప్రాంతాలలో కాంట్రాక్టు సంస్థ పునరుద్ధరణ పనులు చేపడుతోంది.

# కేడీసీసీబీకి జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం

**కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా అవార్డు ప్రదానం**

**మచిలీపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** సహకార రంగంలో అత్యుత్తమ సేవలు అందించిందుకుగాను కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్(కేడీసీసీబీ) భారతదేశంలో రెండోస్థానంలో నిలిచింది. ఐసీఏ ప్రపంచ సహకార రంగాల సదస్సు-2024 కార్యక్రమంలో భాగంగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ అవార్డును ప్రకటించారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును కేంద్రహోంశాఖ, సహకార శాఖల మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా కేడీసీబీ పర్సన్ ఇన్‌చార్జి, కృష్ణాజిల్లా జేసీ గీతాంజలిశర్మ, కేడీసీసీబీ సీఈవో శ్యామ్‌మనోహర్ అందుకున్నారు.



అమిత్‌షా నుంచి అవార్డును అందుకుంటున్న జేసీ గీతాంజలిశర్మ, కేడీసీసీబీ సీఈవో శ్యామ్ మనోహర్

# భూముల సబ్ డివిజన్ సంగతి తేల్చండి!



## రిజిస్ట్రేషన్ చార్జీలు సవరించేలోపు జరిగితేనే మేలు

- కొత్త సంవత్సరంలో భూముల ధరలు పెంచే సమయంలో ఇబ్బందులు
- ఎల్‌పీఎం నంబర్ల ద్వారా వేర్వేరు చోట్ల ఉన్న భూములన్నింటికీ ఒకే విలువ
- ఉమ్మడి జిల్లాలో సగం మండలాల్లోనే రీ సర్వే పూర్తి
- ఎల్‌పీఎం నంబర్లతో రిజిస్ట్రేషన్ అధికారులకు తలనొప్పిలు
- డిసెంబరు మాసాంతానికే సబ్ డివిజన్లు చేయించకపోతే సమస్యలే..

*రీసర్వేలో ఎల్‌పీఎం నంబర్లు కేటాయించటం వల్ల కొత్త సంవత్సరం ప్రారంభంలో భూముల ధరల పెంపు సందర్భంగా అనేక ఇబ్బందులు తలెత్తనున్నాయి. ఎల్‌పీఎం నంబర్ల కారణంగా ఆ నంబర్ పరిధిలోని వేర్వేరు లొకేషన్లలో ఉన్న భూములన్నింటికీ ఒకే ధర వర్తించే ప్రమాదం పొంచి ఉంది. దీని నుంచి బయటపడాలంటే సబ్ డివిజన్స్ నూరు శాతం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అది కూడా డిసెంబరు నెలాఖరు నాటికి చేయగలిగితేనే కొత్త సంవత్సరంలో భూముల ధరల పెంపునకు సంబంధించిన కసరత్తు శాస్త్రీయంగా చేయటానికి అవకాశం ఉంటుంది.*

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** ఉమ్మడి కృష్ణాజిల్లాలో రీ సర్వే సగం మండలాల్లోనే జరిగింది. మిగిలిన సగం మండలాల్లో అసలు రీ సర్వేనే జరగలేదు. రీసర్వేను కొనసాగించాలా ? పాత సర్వే నంబర్లను కొనసాగించాలా అన్న మీమాంస ప్రభుత్వ స్థాయిలో నడుస్తోంది. ప్రస్తుతం ఎల్‌పీఎం నంబర్లను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఎల్‌పీఎం నంబర్ విధానం వల్ల ఆటోమ్యుటేషన్ జరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారు. పూర్తి స్థాయిలో రీ సర్వే జరగకపోవటం వల్ల చాలా గందరగోళంగా ఉంది. కొన్ని చోట్ల ఎల్‌పీఎం నంబర్ల ప్రాతిపదికన, మరికొన్ని చోట్ల సర్వే నంబర్ల ప్రాతిపదికన భూముల ధరలను సవరించాల్సి ఉంటుంది. ఎల్‌పీఎం నంబర్ల ప్రాతిపదికన చూస్తే సబ్ రిజిస్ట్రార్లకు భౌతికంగా అవి ఎక్కడ ఉన్నాయన్నది తెలియదు. సర్వే నంబర్లలో అయితే తెలుస్తుంది.

### ఎల్‌పీఎం నంబర్లలో సమస్య ఏమిటంటే..

రామారావు అనే వ్యక్తికి ఒక ఎల్‌పీఎం నంబర్‌లో ఆయనకు చెందిన వివిధ చోట్ల ఉన్న భూములన్నీ ఉంటాయి. ఒక భూమి జాతీయ రహదారి పక్కనే ఉంటుంది. మరో భూమి చాలా దూరంగా ఉంటుంది. ఎల్‌పీఎం నంబర్ ప్రాతిపదికగా భూముల ధరలను నిర్ణయిస్తే .. జాతీయ రహదారి పక్కన ఉన్న భూమితో పాటు దూరంగా మరో విలువ కలిగిన చోట కూడా ఒకే భూమి ధరకు సిఫార్సు చేసే పరిస్థితి పొంచి ఉంది. ఎల్‌పీఎం నంబర్లలో ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే.. వేర్వేరు చోట్ల ఉన్న భూములను సబ్ డివిజన్ చేయాల్సి ఉంటుంది. సబ్ డివిజన్లు అనేవి ముందుగా రెవెన్యూ శాఖ పరిధిలో జరగాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో సబ్ డివిజన్లకు సంబంధించిన కార్యక్రమాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### సబ్ డివిజన్ చేయడంలో తీవ్ర జాప్యం

సబ్ డివిజన్లు చేయించుకుందామనుకునే వారికి ప్రస్తుతం చుక్కలు కనిపిస్తున్నాయి. రెవెన్యూ కార్యాలయాల పరిధిలో సబ్ డివిజన్లు చేయటానికి రెవెన్యూ సిబ్బంది నానా ఇబ్బందులు పెడుతున్నారు. నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. లంచాల కోసం జాప్యం చేయటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి భూముల అమ్మకాలు, కొనుగోళ్ల మీద తీవ్ర ప్రభావం చూపిస్తోంది. రామారావు అనే వ్యక్తి తన 10 ఎకరాల్లో ఐదెకరాల భూమిని అమ్మాలంటే ముందుగా రెవెన్యూ శాఖలో సబ్ డివిజన్ చేయించుకోవాలి. సబ్ డివిజన్ అయితే కానీ రిజిస్ట్రేషన్ జరగదు. ఈ లోపు కొనుగోలుదారుడి దగ్గర అడ్వాన్స్ తీసుకున్నా.. సబ్ డివిజన్‌కు నెల రోజుల సమయం పడుతున్నందున అమ్మకందారుడు అమ్ముకోలేకపోతున్నాడు. దీంతో సకాలంలో అతని అవసరాలకు డబ్బు అందటం లేదు. దీంతో పాటు కొనుగోలుదారుడు కూడా నెల రోజుల పాటు ఎదురు చూడాల్సి వస్తోంది. ఈ కారణంగా సదరు పార్టీ ఆసక్తి చూపడంలేదు. దీంతో అమ్మకం, కొనుగోళ్లు ఆగిపోతున్నాయి. దీని వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కూడా నిలిచిపోతోంది. ఇలాంటి సమస్యలు ఉన్నందున.. కొత్త సంవత్సరంలో భూములు ధరలు నిర్దేశించే లోపే సమస్యల పరిష్కారానికి సబ్ డివిజన్స్ చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎల్‌పీఎం నంబర్లు ఉన్న ప్రతి భూమికి సంబంధించి సబ్ డివిజన్ చేయించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియను ఎంత త్వరగా పూర్తి చేస్తే అంత మేలు జరుగుతుంది. లేనిపక్షంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

## దస్త్రాల పరిష్కారంలో అలసత్వం వద్దు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**కృష్ణలంక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** దస్త్రాల పరిష్కారంలో అలసత్వానికి తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహంతో కలిసి వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శక సేవలందించడంలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఫైళ్ల పరిష్కారంలో ఇబ్బందులు వుంటే తన దృష్టికి తీసుకురావాలని, తన పరిధిలోని అంశాలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని, ఒకవేళ ఏమైనా అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి వుంటే వెంటనే ఆ పనిచేయనున్నట్టు వివరించారు. ఈ విషయంలో సమిష్టి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కీలక జిల్లా అని వివిధ రాష్ట్రస్థాయి కార్యక్రమాలు ఇక్కడ జరుగుతుంటాయని, వీటిని విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములవుతూనే మరోవైపు రోజువారీ అధికారిక విధుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు.



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఏపీ ఎన్జీవో నేతలు

## జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం

జిల్లా అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో ప్రజలకు పారదర్శకమైన సేవలందించి జిల్లాను అభివృద్ధిలో నిలిపేందుకు కృషి చేద్దామని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అధ్వర్యంలో జిల్లా, నగర కార్యవర్గసభ్యులు మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవో నేతలు డి.సత్యనారాయణరెడ్డి, పి.రమేష్, బి.సతీష్‌కుమార్, బీవీ రమణ, నాగేంద్రరావు, సీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలు వింటున్న తహసీల్దారు శివయ్య

## విమానాశ్రయ విస్తరణలో రైతులకు ప్లాట్లు

**గన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** గన్నవరం విమానాశ్రయ విస్తరణలో 12 సెంట్లలోపు భూమి మిగిలిపోయిన రైతులకు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్ధారు కేవీ శివయ్య మాట్లాడుతూ, 7.90 ఎకరాల్లో 12 సెంట్లలోపు భూమి మిగిలిన రైతులు 103 మంది ఉన్నారని, 12సెంట్లు పైన ఉంటే ప్లాట్లు కేటాయిస్తారని, తక్కువ ఉంటే ఇద్దరు కలిసి రాసుకుని ప్లాట్లు పొందాలని చెప్పారు. జీవో నెంబర్ 190 ప్రకారం ఆప్షన్స్ ఉన్నాయని, వాటిల్లో ఏదో ఒకటి ఉంచుకుని లబ్ధి పొందాలని సూచించారు. టీడీఆర్ బాండ్స్ ఇవ్వడానికి సీఆర్‌డీఏ ముందుకు వచ్చినట్టు చెప్పారు. ఇద్దరు ముగ్గురు కలిసి పొందిన ప్లాట్లను వద్దనుకుంటే సీఆర్‌డీఏ అధికారులు వేలం వేస్తారని వచ్చిన నగదును ఆయా రైతులు పంచుకోవచ్చన్నారు. 70 మంది రైతులు వచ్చారని వారిలో కొందరు అంగీకార పత్రాలను ఇస్తామని చెప్పారని కొందరు కొత్త జీవో ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. సీఆర్‌డీఏ రిజిస్ట్రేషన్ డిప్యూటీ తహసీల్ధారు శ్రీహరి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.





ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ. 2 లక్షల చెక్కును అందజేస్తున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

## అమరావతి అభివృద్ధికి రూ. 2 లక్షలు

**కంకిపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** అమరావతి అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ. 2 లక్షలు ఆర్థిక సాయాన్ని అందజేసినట్టు ఏపీ వ్యవసాయ మార్కెట్ కమిటీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు సాయం అందించేందుకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ముందుకు రావడం జరిగిందని తెలియజేశారు. అలాగే వారు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఎంకు వినపతి పత్రం అందజేసినట్టు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోనపురెడ్డి సుధాకర్ రాజు, నక్క వెంకటరత్నం, పెద్దాపురం శ్రీను, శ్రీరాములు అదోని, కృష్ణా జిల్లా అధ్యక్షులు కె.కోటేశ్వరరావు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో ప్రిన్సిపాల్ వెంకటరమణ

## ఆటల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

**హనుమాన్‌జంక్షన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం(డిసెంబరు 3) పురస్కరించుకొని మంగళవారం ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీల్లో ఆదిత్య బధిర విద్యాలయానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ తెలిపారు. పరుగులో బి.మణికంఠ, క్యారమ్స్‌లో నిత్యానంద్‌కుమార్ ప్రథమ స్థానం, ఎ.అఖిల, బి.కుసుమ, ఎ.ఏసుబాబు ద్వితీయస్థానం, డిస్కస్‌త్రోలో బి.హర్షిణి, ఎ.నరసింగ తృతీయ స్థానాలు సాధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

# రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

» భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కృష్ణా కలెక్టర్ బాలాజీ

**మచిలీపట్నం టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** భారత రాజ్యాంగానికి ఒక ప్రత్యేకత ఉందని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేశ్ తదితరులు పాల్గొన్నారు. చిలకలపూడి



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ బాలాజీ, డీఆర్వో చంద్రశేఖర్ తదితరులు

మునిసిపల్ ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి డీఈవో పీవీజీ రామారావు, డీవైఈవో శేఖర్‌సింగ్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణావిశ్వవిద్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావుతో పాటు సైన్స్ అండ్ ఆర్ట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఉష, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్, కార్యదర్శి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు. విన్‌వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్సీఎం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆర్సీఎం ఫాదర్ ఎన్.డేవిడ్ రాజు, అరవిందకుమార్, మత్తే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పీఠికలోని ప్రతి అక్షరం రాజ్యాంగ విశిష్టతను చాటిచెప్పేదే

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**కృష్ణలంక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమున్నత భారత రాజ్యాంగం చూపిన బాటలో నడిచి ఉత్తమ పౌరులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠికను చదివి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వతంత్ర్య భారతావని అత్యుత్తమ ప్రజాస్వామ్య వ్యవస్థతో సగర్వంగా నిలిపిన రాజ్యాంగాన్ని 1949, నవంబరు 26న ఆమోదించుకోవడం జరిగిందని, దేశ చరిత్రలో అపూర్వమైన ఈ ఘట్టానికి గుర్తుగా ఏటా నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని వేడుకగా జరుపుకొంటున్నామని వివరించారు. రాజ్యాంగ పీఠికలోని ప్రతి అక్షరం రాజ్యాంగ విశిష్టతను చాటిచెబుతోందని, ఈ పీఠకలో పొందుపరిచిన లక్ష్యాలు, ఆశయాలు, ఆదర్శాలను తెలుసుకోవడం ద్వారా మనం ఎంత గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థలో వున్నామనేది స్పష్టమవుతుందన్నారు. బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయుల బాటలో యువత నడుస్తూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

## మేమేం పాపం చేశాం!

» రెండు దశాబ్దాలుగా నో ప్రమోషన్స్

» ఆర్టీసీలో అకౌంట్స్ ఉద్యోగుల వెతలు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో పనిచేసే అక్కౌంట్స్ ఉద్యోగులను ఆర్టీసీ యాజమాన్యం చిన్న చూపు చూస్తోంది. అందరితో పాటు పని చేసే అక్కౌంట్స్ సిబ్బందికి పదోన్నతులు లేకుండా చేయటం వారికి తీరని అన్యాయం చేయటమే అవుతోంది. అన్ని విభాగాల్లో ప్రమోషన్లు కల్పిస్తున్నా.. అక్కౌంట్స్ విభాగంలో కల్పించ కపోవటం వారిని తీవ్రంగా బాధిస్తోంది. డిపో మేనేజర్లకు ఆరేళ్లలో పదోన్నతులు వస్తుంటే అక్కౌంట్స్ అధికారులకు మాత్రం 19 సంవత్సరాలు దాటినా పదోన్నతులు వరించటం లేదు. రెండు దశాబ్దాలకు పైగా పదోన్నతులకు నోచని అక్కౌంట్స్ విభాగం అధికారులు దురదృష్టవంతులే. ఆర్టీసీ అక్కౌంట్స్ విభాగంలో సిబ్బంది కుదింపులో భాగంగా నాటి ఎండీ సురేంద్రబాబు కొన్ని సంస్కరణలు చేపట్టారు. ఈ సంస్కరణల ఫలితంగా అక్కౌంట్స్ అధికారులు గణనీయంగా తగ్గిపోయారు. ప్రస్తుతం డిప్యూటీ సీఏవో అధికారులు ఐదుగురు, అక్కౌంట్స్ ఆఫీసర్స్ ఏడుగురు కలిపి 12మంది ఉన్నారు. అక్కౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న వారంతా ఎంతో కష్టపడి సీఏ చదివి వచ్చిన వారే.. ఆర్టీసీలో అక్కౌంట్స్ విభాగంలో పనిచేయాలంటే సీఏ, సీఎంఏ వంటి విద్యార్హతలు ఉండాలి. తమ బాధను అర్థం చేసుకోవాలని తమకు కూడా ప్రమోషన్లు కల్పించాలని ఎప్పటి నుంచో యాజమాన్యానికి మొరపెట్టుకుంటున్నా వినటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆర్టీసీలో ఇన్‌చార్జిల పేరుతో అనధికారికంగా పదోన్నతులు కల్పించారు. అక్కౌంట్స్ విభాగాన్ని మాత్రం పక్కన పెట్టేశారు. తాము చేసుకున్న పాపమేమిటని వీరు ప్రశ్నిస్తున్నారు. అక్కౌంట్స్ సిబ్బంది ఎక్కువగా ఉన్నారనుకుంటే.. కార్గో విభాగంలో వారి సేవలను వినియోగించుకోవచ్చు. కార్గో విభాగంలో సిబ్బంది పర్యవేక్షణ లేకపోవటం వల్ల అస్తవ్యస్తంగా తయారౌతోంది. ఈ దిశగా యాజమాన్యం ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### దేవస్థానం చెరువు సర్వే

**మోపిదేవి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఆధీనంలో ఉన్న కోనేరు చెరువు, కోసూరువారిపాలెం గ్రామానికి చెందిన నరేషకు చెందిన స్థలానికి వివాదం ఏర్పడిన నేపథ్యంలో మంగళవారం సర్వే నిర్వహించారు. మచిలీపట్నంకు చెందిన ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే బి.లీలా ప్రసాద్ ఆధ్వర్యంలో సర్వేయర్ల బృందం సర్వే చేపట్టారు. పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించటం జరుగుతుందని ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే తెలిపారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు, సర్వేయర్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఓటర్ల జాబితా రూపకల్పన

**కృష్ణలంక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** ఎన్నికల ప్రక్రియను సాఫీగా, విజయవంతంగా పూర్తిచేయాలంటే ఓటర్ల జాబితా దోషరహితంగా వుండాలని, ఈ నేపథ్యంలో జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యదర్శి, జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు ఎం.ఎం.నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎం.ఎం.నాయక్, ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)-2025పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ, స్వచ్ఛీకరణపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా రూపొందించేందుకు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకొంటూ పనిచేయాలని సూచించారు. ఈనెల 28వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణకు గడువు వుందని, వీటిని డిసెంబరు 24లోగా పరిష్కరించి జనవరి 6న తుది జాబితా ప్రచురించాల్సి వుంటుందన్నారు. అర్హులైన వారిని కొత్తగా ఓటరుగా నమోదు చేసుకొనేలా ప్రోత్సహించాలని, ముఖ్యంగా 18-19 వయస్సు వారిపై దృష్టిసారించి, నమోదుకు కృషి చేయాలన్నారు. ఇందుకు కళాశాలల్లోని ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లను క్రియాశీలం చేయాలన్నారు. అదేవిధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయ పక్షాల ప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఇతర ఫారాలపైనా అవగాహన పెంపొందించాలన్నారు. జనాభాలో ఓటర్ల నిష్పత్తి, స్త్రీ-పురుష ఓటర్ల లింగ నిష్పత్తి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, లాజికల్, డెమోగ్రాఫికల్ దోషాలు వుంటే చక్కదిద్దాలన్నారు. దరఖాస్తుల పరిష్కార ప్రక్రియకు సంబంధించి ఈఆర్వోలు, ఏఈఆర్వోలు ర్యాండమ్‌గా సూపర్ చెక్ చేయాలన్నారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం ఎస్ఎస్ఆర్-2025కు సంబంధించిన అంశాలను వివరించారు. 2024, అక్టోబరు 29న ప్రచురించిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 17,04,611 మంది ఓటర్లు వున్నారని తెలిపారు. ఈపీ రేషియో 703గా, జెండర్ రేషియో 1052గా వుందన్నారు. నవంబరు 9, 10 తేదీలతో పాటు నవంబరు 23, 24 తేదీల్లోను క్లెయిమ్‌లు, ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించామన్నారు. దరఖాస్తులను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పరిష్కరించి తుది జాబితా ప్రచురణకు చర్యలు తీసుకొంటున్నట్టు తెలిపారు. తిరువూరు ఈఆర్వో కె.మాధురి, విజయవాడ తూర్పు ఈఆర్వో కె.చైతన్య, నందిగామ ఈఆర్వో కె.బాలకృష్ణ, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు నాయక్



యువసంగం కోసం యూపీకి పయనమైన విద్యార్థులు

## యువసంగం కోసం యూపీకి ఏపీ విద్యార్థులు

**పెనమలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** యువసంగం-2024లో భాగంగా ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచి ఎంపికైన 42 మంది విద్యార్థుల బృందం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నుంచి ఉత్తర ప్రదేశ్‌కు వెళుతూ కానూరు కామయ్యతోపు వరకు బస్సు యాత్ర నిర్వహించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లక్ష్యానికి అనుగుణంగా యువతలో సాంస్కృతిక ఐక్యత, సహకారాన్ని ప్రోత్సహించడం, రాష్ట్రాల మధ్య జాతీయ ఐక్యత, అవగాహన భావాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమం అవకాశం కల్పిస్తుందని డైరెక్టర్ రమేష్ శ్రీకొండ తెలిపారు. కార్యక్రమం ఏపీ, యూపీల మధ్య సాంస్కృతిక మార్పిడిని సులభతరం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు, డీన్ వెంకట కృష్ణకుమార్ సాధు, భగవత్ జయేష్‌కుమార్, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టిప్పర్ ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు

» కాసరబాదలో గ్రామస్థుల ఆందోళన

**చందర్లపాడు, నవంబరు 26 :** అధిక లోడుతో వెళ్తున్న టిప్పరు ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కాలుకి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో కాసరబాద గ్రామంలో మంగళవారం జరిగింది. రీచ్ నుంచి ఇసుక నింపుకున్న టిప్పర్ పొక్కునూరు మీదగా నందిగామకు బయల్దేరి కాసరబాదలోని హనుమాన్ విగ్రహం సెంటర్ వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టింది. దీంతో మోపెడ్ నడుపుతున్న నంద్యాల రామిరెడ్డి ఎడమకాలు నుజ్జు అయింది.

**రైతులు, గ్రామస్థుల ఆందోళన**

ఇసుక టిప్పరు ఢీకొని గ్రామస్తుడికి తీవ్రగాయాలు కావటంతో రైతులు ఆగ్రహం కట్టలు తెంచుకుని ఆందోళనకు దిగారు. టిప్పర్‌ను రోడ్డుపై నిలిపివేసి క్షతగాత్రుడికి న్యాయం చేయాలని బైఠాయించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకోని అధికారులు వచ్చి సమాధానం ఇచ్చేవరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. రైతులు ఆందోళనతో రీచ్‌లో పొక్లెయిన్లు, టిప్పర్లను తప్పించడంతోపాటు సిబ్బంది పత్తా లేకుండా పోయారు.





రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు, గ్రామస్థులు.. నెత్తురోడుతున్న కాలుతో రైతు

# పత్తి రైతుపై కత్తి

## సీసీఐ నిబంధనల గుదిబండ



» నామమాత్రంగా కొనుగోళ్లు

» దెబ్బతీసిన గులాబీ పురుగు

» నిబంధనలు సడలించకపోతే రైతు కోలుకోవడం కష్టం

» ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

**(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)** తెల్ల బంగారంగా పేరొందిన పత్తి పంట నేడు రైతుల పాలిట గుదిబండగా తయారైంది. ఒకవైపు దిగుబడి లేదు. మరోవైపు గిట్టుబాటు ధర లేదు. బాధిత రైతులను అక్కున చేర్చుకుని మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాల్సిన భారత పత్తి సంస్థ (సీసీఐ) నిబంధనల కత్తి ఝులిపిస్తున్నది. తూకంలో, ధరలో ఎడా పెడా కోత విధిస్తోంది. మిల్లుల వద్ద స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొనటం లేదు. అధిక వ్యయప్రయాసలకు గురవుతున్న రైతులు, గత్యంతరం లేక ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు తెగనమ్ముకుంటున్నారు. జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల పరిధిలో దాదాపుగా లక్ష ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. కౌలుతో కలిపి ఎకరానికి సగటున రూ. 50 వేలకు పైగా పెట్టుబడి అయింది. అధిక వర్షాలు, వరదల వల్ల చేలు దెబ్బతిన్నాయి. మహమ్మారి గులాబీ రంగు పురుగు దాడి చేసింది. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఎకరానికి ఐదారు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. దీనికితోడు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించకపోవటంతో రైతులు నిలువునా క్రుంగిపోయారు.

### పేర్లు నమోదుకు విముఖత

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సీసీఐ, సీఎం యాప్ ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నది. ఈక్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు, తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకళ్లు తీసుకువెళ్లి తమ పేర్లు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాల్సి ఉంది. ప్రత్యేకంగా యాప్‌లో నమోదు చేయించుకున్న రైతుల వద్ద మాత్రమే సీసీఐ పత్తి కొంటున్నది. ఎక్కువ మంది రైతులు ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దూర ప్రాంతాల్లో ఉన్న వారు తమ పేర్లు నమోదు చేయించుకోవటం లేదు.

### వెలవెలబోతున్న మార్కెట్ యార్డులు

వ్యవసాయ మార్కెట్ యార్డులు అలంకారప్రాయంగా తయారయ్యాయి. యార్డుల్లో పక్షం రోజుల క్రితమే సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరిచినప్పటికీ, ఒక్క కిలో పత్తి కూడా కొనలేదు. మిగతా యార్డుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. నేరుగా మిల్లుల వద్దకు రైతులు తీసుకువచ్చిన పత్తినే సీసీఐ బయ్యర్లు కొంటున్నారు. బయ్యర్లు మాత్రం యార్డుల వైపు చూడటం లేదు. ఈ విషయం తెలియక కొంత మంది రైతులు, యార్డుల చుట్టూ తిరుగుతున్నారు.

### తూకం, ధరలోనూ కోత

సీసీఐ నిబంధనల వల్ల రైతులకు ఏలాంటి ప్రయోజనం లేకపోగా, ఎంతో నష్టం జరుగుతున్నది. తేమ 12 శాతానికి మించి ఉందంటూ తూకంలో కోత పెడుతున్నారు. క్వింటాకు మూడు నాలుగు కిలోల వంతున తూకం తగ్గిస్తున్నారు. దీనికితోడు కేంద్రం ప్రకటించిన రూ. 7,521 మద్దతు ధర ఇవ్వటం లేదు. అతి కొద్ది మందికి మాత్రమే మద్దతు ధర దక్కుతుంగా, తేమ పేరుతో 90 శాతం మంది రైతులకు ధరలో కోత విధిస్తున్నారు. తేమ ఎనిమిది శాతం లోపు ఉండాలి. అయితే ఎనిమిది నుంచి 12 శాతం వరకు ఒక్కొక్క శాతానికి రూ. 75.21ల వంతున అధిక వ్యయ ప్రయాసలు పడినప్పటికీ మద్దతు ధర ఎండమావి కావటంతో ఎక్కువ మంది రైతులు ధర తక్కువైనప్పటికీ ప్రైవేట్ వ్యాపారులకు తెగనమ్ముకుంటున్నారు. వ్యాపారులు పత్తి నాణ్యతను బట్టి క్వింటాకు రూ. 5500 నుంచి రూ. 6500 లోపు ధర ఇస్తున్నారు.

### నామమాత్రంగా సీసీఐ

మార్కెట్ యార్డులకు దూరంగా ఉంటున్న సీసీఐ మిల్లుల వద్ద కూడా చురుకుగా కొనటం లేదు. నిబంధనల కత్తెరతో ఆచితూచి కొంటున్నది. ఈనెల 24 వరకు జిల్లాలోని 1,556 మంది రైతుల నుంచి సీసీఐ 43,529.28 క్వింటాళ్ల పత్తి కొన్నది. ఈ పత్తి విలువ రూ. 31,21,86,418. సగటున క్వింటాకు రూ. 7,171.87 ధర ఇచ్చింది. ఇకనైనా సీసీఐ నిబంధనలు సడలించి, కోతల్లేకుండా, మద్దతు ధర ఇవ్వాలని, మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోలు చేయాలని రైతుల కోరుతున్నారు. పాలకులు కేంద్ర ప్రభుత్వం, సీసీఐపై ఒత్తిడి తీసుకురావాల్సిందిగా రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ నెల 24వ తేదీ వరకు ఏఎంసీల వారీగా సీసీఐ కొనుగోళ్ల వివరాలు..

| ఏఎంసీ | రైతులు | పత్తి (క్వింటాళ్లలో) |
|---|---|---|
| తిరువూరు | 137 | 4939.85 |
| నందిగామ | 469 | 10619.95 |
| జగ్గయ్యపేట | 324 | 8724.70 |
| మైలవరం | 204 | 6819.10 |
| కంచికచర్ల | 422 | 12425.68 |
| మొత్తం | 1556 | 43529.28 |

## గన్నీలతో ఎత్తేస్తున్నారు!

(5వ పేజీ తరువాయి)

ఆ డాన్ తన చేతుల్లో ఒకవైపు సివిల్ సప్లయిస్ అధికారులు, మరో వైపు విజిలెన్స్ అధికారులు ఉన్నారు. తనను కాదని మరొకరికి విక్రయిస్తే ఆ షాపులపైనే తనిఖీలు జరుగుతాయి. వారి అక్రమ బియ్యంపైనే రైడింగ్‌లు జరుగుతాయి. దీంతో డీలర్లంతా ఏకంగా గన్నీ బ్యాగులతోనే ఆ అక్రమ బియ్యం వ్యాపారికి అందించేస్తున్నారు. విజిలెన్స్ అధికారుల అండదండలతో గన్నీ బ్యాగులతో ఉన్న బియ్యం బస్తాలు మిల్లులకు, ముంబాయికి తరలిపోతున్నాయి. గన్నీ బ్యాగులతో కూడిన బియ్యం బస్తాలు మంగళగిరి, పెదవడ్లపూడి, గుంటూరు బైపాస్‌లోని రేషన్ మిల్లులకు పెద్ద ఎత్తున వెళుతున్నాయి. ఈ విషయం విజిలెన్స్ అధికారులకు కూడా తెలుసు. కానీ అక్రమ బియ్యం వ్యాపారులతో ఉన్న సంబంధాల కారణంగా పట్టించుకోవటం లేదు.

### రేషన్ మాఫియా తెలివితేటలు

తనిఖీలలో పట్టుకున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేసే సందర్భంలో అధికారులు ఆ బియ్యం ఎవరి నుంచి సేకరించారు అని లోతుగా విచారిస్తే డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో పాటు బియ్యం అమ్ముకున్న కార్డుదారులు కూడా బయటకువస్తారు. పట్టుకున్న బియ్యం రేషన్ బియ్యమే అన్న దానికి ఆధారాలు లభిస్తాయి. కానీ అక్రమ బియ్యం పట్టుకున్న సందర్భాలలో ఈ పని మాత్రం సివిల్ సప్లయిస్ అధికారులు చేయడం లేదు. దీంతో సీజ్ చేసిన తర్వాత అక్రమ బియ్యం వ్యాపారులు కోర్టుకు వెళుతున్నారు. అసలు ఇవి రేషన్ బియ్యం కాదని వాదిస్తున్నారు. కోర్టులలో అవి రేషన్ బియ్యమేనని సివిల్ సప్లయిస్ అధికారులు చెప్పలేకపోతున్నారు. దీంతో సివిల్ సప్లయిస్ అధికారుల వాదనలు పనిచేయటం లేదు. అక్రమ బియ్యం వ్యాపారులకు అనుకూలంగా తీర్పులు వస్తున్నాయి. సీజ్ చేసిన బియ్యాన్ని బ్యాంకు పూచీకత్తుతో వెంటనే విడుదల చేయాల్సి వస్తోంది. ఆ తర్వాత దర్జాగా ఈ బియ్యాన్ని అక్రమార్కులు సరిహద్దులు దాటించేస్తున్నారు.

## బ్రాయిలర్ ధరలు



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 112,121, 132 |
| చికెన్ విత్ స్కిన్ | 210 |
| చికెన్ స్కిన్‌లెస్ | 220 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 595

## భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు శిక్షణ, పరీక్షలు


శిక్షణపొందుతున్న విద్యార్థులు

విజయవాడ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు మంగళవారం శిక్షణ, పరీక్షలు జరిగాయి. జిల్లా స్థాయిలో నున్న గ్రామంలోని కెనడీ హైస్కూల్లో జరిగిన శిక్షణ, పరీక్షలకు స్కౌట్స్ అండ్ గైడ్స్ డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్ ఎం. గోపాలకృష్ణ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ, గుంటూరు, రాజమండ్రి ప్రాంతాల నుంచి సుమారు 160 మంది విద్యార్థులు హాజరయ్యారు. శిక్షణ అనంతరం జరిగిన పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కమిషనర్ అప్పలరాజు, స్కూల్ హెచ్ఎం రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

## వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వీరవల్లి హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం రాము ఆధ్వర్యంలో మానవత సేవా సంస్థ సహకారంతో మంగళవారం నిర్వహించిన నైతిక విలువలు- వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై అవగాహన, కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు పాల్గొన్నారు. గత సంవత్సర పరీక్షల్లో 6,7,8,9 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు మానవత ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేసి అభినందించారు. ఈ సభ్యులు జయరామచంద్రరావు, రాజేశ్వరరావు, రామచంద్రరావు, సూర్యనారాయణ, ఉపాధ్యాయులు కృష్ణారావు, రమణగోపాల్, పాల్గొన్నారు.

## కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వీరవల్లిలో మమతలపందిరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం గుండపనేని ఉమావరప్రసాద్‌తో కలిసి సర్పంచ్ పిల్లా అనిత ప్రారంభించారు. నారీశక్తి కార్యక్రమం ద్వారా మండల వ్యాప్తంగా 172 దరఖాస్తులు రాగా అందులో 60మంది మహిళలకు మూడు నెలలపాటు శిక్షణ, అనంతరం సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు లంక రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లంక అజయ్, గుండపనేని వాణి, లంక సురేంద్ర మోహన బెనర్జీ, కలపాల నాని, రాజాబాబు, రమేష్, రాయి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు


నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు


ఏజీఅండ్ఎస్‌జీఎస్ కళాశాలలో ఎగ్జిబిషన్


భారతదేశ చిత్రపటం ఆకారంలో విద్యార్థులు

# దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన అంబేడ్కర్

● వాడవాడలా ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవాలు ● అంబేడ్కర్ చిత్రపటాలకు పలువురి నివాళులు

గన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని అందరికి ఆమోద యోగ్యంగా రూపొందించి, ప్రపంచవ్యాప్తంగా దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయులని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో భారతరాజ్యాంగం ఆమోదం పొంది75 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అంబేడ్కర్ సేవలను కొనియాడారు. అనంతరం గన్నవరం క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలు అప్పటికప్పుడు పరిష్కరించారు. వారంలో రెండు రోజులు గన్నవరం, మరో రెండు రోజులు క్యాంపు కార్యాలయాల్లో అందుబాటులో ఉంటానని, వ్యక్తిగత సిబ్బంది 7 రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి, బోడపాటి రవికుమార్, బసవపూర్ణయ్య పాల్గొన్నారు.

**గన్నవరం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో టి.స్వర్ణలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పురుషోత్తపట్నం గ్రంథాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి, గ్రంథాలయ అధికారి కృపానందం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముస్తాబాద నవ భారత్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ ఇమాం భారత రాజ్యాంగం గురించి వివరించారు.

**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగినది మన రాజ్యాంగమని ఆళ్ల గోపాలకృష్ణ, సర్పంచ్ పిల్లా అనిత, కసుకుర్తి రంగామణి, హెచ్ఎం లూథర్‌పాల్, విజయ్ తదితరులు వేర్వేరు కార్యక్రమాల్లో తెలిపారు. వీరవల్లిలో మండాది రవీంద్ర, గుండపనేని ఉమావరప్రసాద్, వీఆర్‌ఓ సునీల్ తదితరులు, కానుమోలులో రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ తదితరులు విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. రేమల్లె హైస్కూల్‌లో దారపురెడ్డి భాస్కరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు భారతదేశ చిత్రపటం ఆకారంలో నిలబడి నివాళులర్పించారు. బండారుగూడెంలో సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దంటగుంట్ల, బొమ్ములూరు, మల్లవల్లి తదితర గ్రామాల్లో భారత రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**హనుమాన్‌జంక్షన్:** మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ వై.నగేష్ తోపాటు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు పూల మాలవేసి నివాళి అర్పించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ వి.నాగభూషణం, కార్యాలయ సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

**విజయవాడ రూరల్:** నున్న గ్రామంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నేతలు బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

**ఉయ్యూరు:** ఆర్డీవో కార్యాలయంవద్ద అంబేడ్కర్ చిత్రపటానికి ఆర్డీవో హేలా షారోన్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఏవో భద్రునాయక్, భవాని శంకర్ పాల్గొన్నారు. ఏజీఅండ్ఎస్‌జీఎస్ కళాశాలలో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

**ఉంగుటూరు:** ఉంగుటూరు జడ్పీహైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో హెచ్ఎం అనిత భారత రాజ్యాంగం-విశిష్టత-పాలనా విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**పెనమలూరు:** తాడిగడప, కానూరు, పెనమలూరు, పోరంకి ఉన్నత పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. వీఆర్ సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల(డీమ్డ్ టుబి యూనివర్సిటీ), కానూరు కేసీపీ పాఠశాలలో రాజ్యాంగ విలువలను విద్యార్థులకు వివరించారు. పెనమలూరు వైసీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ జరిగింది. ఈసందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడ్కో మాజీ డైరెక్టర్ చిన్నారి, బాకీబాబు, రాజు, శ్రీహరి, అన్వర్, పాండ్రక్క బాబు పాల్గొన్నారు.

**కంకిపాడు:** మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో ఎంపీడీవో అనూష, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కార్యదర్శి అప్పారావు సిబ్బంది పాల్గొన్నారు. కంకిపాడు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం సుధారాణి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ అజ్గర్ షరీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సత్కరిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

## నాంచారయ్యకు ఎంఎస్ నారాయణ ఎక్సలెన్స్ అవార్డు

ఉయ్యూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కడవకొల్లుకు చెందిన ప్రముఖ నాటకరంగ కళాకారుడు ఎర్రపోతు వెంకట నాంచారయ్య నాయుడు ఎంఎస్ నారాయణ ఎక్సలెన్స్ -2024 అవార్డు అందుకున్నారు. ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతి, సర్దార్ వల్లభభాయ్ పటేల్ 149వ జయంతి పురస్కారాల సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ఎస్.సరోజ నమ్మ తదితరుల నుంచి వెంకట నాంచారయ్య నాయుడు అవార్డు అందుకున్నారు.

## కోటి దీపోత్సవం

గన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీ కాశీ విశాలాక్షీ అన్నపూర్ణ దేవి సహిత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో కోటి దీపోత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత కార్తీక ఏకాదశి సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం స్వామివారిని వివిధ పుష్పాలతో అలంకరించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు శివలింగం ఆకారంలో దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ సభ్యులు,పాల్గొన్నారు.

## కార్మికులు ధర్నా నేడు

గన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనాయి చెరువు సమీపంలోని అయోధ్య అపార్టుమెంట్స్‌లో 2018 నుంచి 2022 వరకూ గుర్రం అంజయ్య(నాని) ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులుగా పనులు చేసిన తమకు రావాల్సిన డబ్బులు ఇవ్వటం లేదని బుధవారం ఉదయం 9గంటలకు కార్మికులంతా కలసి ధర్నా చేస్తున్నట్లు రామ్మోహన రావు, సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలాది మంది కూలీలకు తాపీ మేస్త్రీలుగా తాము డబ్బులు ఇవ్వాలి. ఎక్కడికి వెళ్లిన ఎవరు పట్టించుకోవటం లేదని అందుకే అపార్టుమెంట్స్ వద్ద ధర్నా చేపట్టినట్లు తెలిపారు.


అన్నదానం చేస్తున్న ఎస్సై విశ్వనాథ్

## అన్న సమారాధన

ఉయ్యూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శివాలయం రోడ్డు సాయిబాబా మందిరం ఆవరణలో అయ్యప, భవానీ, శివ, గోవింద స్వాములకు అన్నసమారాధనను పట్టణ ఎస్సై విశ్వనాథ్ మంగళవారం ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో 41 రోజులపాటు అన్నసమారాధన చేయడం అభినందనీయమన్నారు. గురుస్వామి వీరంకి చింతయ్య, అల్లు అనీల్‌చంద్, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో దాత సజ్జా వెంకటేశ్వరరావు సహకారంతో అన్న సమారాధన ప్రారంభించారు.

## అర్హులకు ఓటు హక్కు తప్పనిసరి

గన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలని తహసీల్దార్ కేవీ శివయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో మంగళవారం ఓటు హక్కుపై యువ ఓటర్లకు అవగాహన కల్పించారు. తొలుత విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దారు కిషోర్, ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి వరం

గన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి రోగులకు వరం లాంటిదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం రాత్రి తేలప్రోలుకు చెందిన పి.విజయకుమార్‌కు రూ.40,100, ఎనికేపాడుకు చెందిన వెంకటేశ్వరరావుకు రూ.56,500, కొత్తపల్లికి చెందిన శ్రీనివాసరావుకు రూ.30వేలు, నాగవరప్పాడుకు చెందిన జానకికి రూ.35వేలు, నున్నకు చెందిన జయప్రదకు రూ. 41,754, ఉంగుటూరుకు చెందిన మహేష్‌కు రూ.60వేలు, పెద అవుటపల్లికి చెందిన శ్రీమన్నారాయణకు రూ.85,750, ప్రసాదంపాడుకు చెందిన జొన్నలగడ్డ నితీష్‌కు రూ.57,953, సూరంపల్లికి చెందిన భవానికి రూ.1,58,930లక్షలు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు దయాల రాజేశ్వరరావు, ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## హైందవ శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ

**హనుమాన్‌జంక్షన్:** వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ బాపులపాడు మండల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక విజయవాడ రోడ్డులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆవరణ వద్ద పరిషత్, అనుబంధ సంఘాల కార్యకర్తలతో శంఖారావం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శంఖారావం వాల్ పోస్టర్ విడుదల చేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బౌద్ధ ప్రముఖ గణేష్, గన్నవరం ఖండ కార్యవాహ ఎదురువాడ శ్రీనివాసరావు, మాతృశక్తి సంస్థ కృష్ణా జిల్లా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, సమరసత సేవా ఫౌండేషన్ గన్నవరం సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ పాండురంగారావు పాల్గొన్నారు.

# వ్యవస్థలను భ్రష్టుపట్టించిన జగన్

● ఎమ్మెల్యే బోడె ప్రసాద్


పాదయాత్రలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలను అన్ని విధాలా దోచుకొని రాష్ట్ర భవిష్యత్తును సర్వనాశనం చేసిన వైసీపీ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మూడో రోజు పల్లెప్రగతి పాదయాత్రలో భాగంగా తాడిగడప మునిసిపాలిటీ యనమలకుదురు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కనీసం సౌకర్యాలు పూర్తిగా నిర్లక్ష్యం చేసి బూటకపు బటన్‌లు నొక్కుకుంటూ వ్యవస్థలను భ్రష్టు పట్టించిన జగన్ బారిన పడ్డ రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకు వెళుతుందని పేర్కొన్నారు. స్థానికులకు ఎటువంటి సమస్యలున్నా తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీహెచ్ గోపాలకృష్ణ

## కల్తీ ఆహారం పట్ల అప్రమత్తత అవసరం

ఉయ్యూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆహార పదార్థాలతో పాటు అన్నీ కల్తీమయంగా ఉన్న నేటి పరిస్థితుల్లో అప్రమత్తతో వ్యవహరించి అనారోగ్యం, ప్రాణహాని నుంచి జాగ్రత్తపడాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సీహెచ్ గోపాలకృష్ణ అన్నారు. ఏజీఅండ్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్రం, ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఆహారంపై క ల్తీ ప్రభావం అనే అంశంపై కళాశాలలో రెండు రోజుల వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభించారు. కల్తీ ఆహారం వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలు, ఆహార కల్తీని ఎలా గుర్తించాలి తదితర విషయాలను వివరించారు. ఆహారం కల్తీ జరగడానికి కారణాలు, కల్తీ ప్రభావం ప్రస్తుత పరిస్థితుల్లో ఎలా ఉందన్నది జోస్యుల నాగేశ్వరరావు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు. రసాయన శాస్త్ర అధిపతి గిరిప్రసాద్, పీజీ అధిపతి వీఎస్‌వీ కిషోర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులూ.. ఆందోళన చెందొద్దు

● ఏవో భవాని


రైతులకు సూచనలిస్తున్న భవాని

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పనల మీద వరిని కుప్పలు వేయాలని, పంట నూర్చిన వారు ధాన్యం తడవకుండా టార్పాలిన్‌తో కప్పి జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి భవాని రైతులకు సూచించారు. వీరవల్లి, కానుమోలు, ఆరుగొలను గ్రామాల్లో మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆమె తుఫాన్ హెచ్చరికలతో ఆందోళన చెందుతున్న రైతులకు భరోసా కల్పిస్తూ, ధాన్యం నిల్వ పద్ధతులపై అవగాహన కల్పించారు. వరి పంట కోసిన రైతులు పొలంలోనే కుప్పలు వేసి వర్షపునీరు చేరకుండా చుట్టూ కందకాలు తీయాలని, నూర్చిన వారు ధాన్యం తడవకుండా రైతు సేవా కేంద్రాల్లో టార్పాలిన్‌ను తీసుకుని కప్పి ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులతో పాటు వీఏఏ లక్ష్మీనారాయణ, శ్రావణి, లలిత, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

## చురుగ్గా ఆధార్ అప్‌డేట్

హనుమాన్‌జంక్షన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోస్టాఫీసులో నిర్వహిస్తున్న ఆధార్ అప్‌డేట్ కోసం వస్తున్న ప్రజలకు ఎదురవుతున్న సమస్యకు అధికారులు చెక్ పట్టారు. పోస్టాఫీసులో ఆధార్ అప్‌డేట్ ఎంట్రీ కోసం ఏర్పాటు చేసిన కంప్యూటర్, స్కానర్ సక్రమంగా పని చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 19న ఆంధ్రజ్యోతిలో ఆధార్...నో అప్‌డేట్ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి మంగళవారం అదనంగా మరో కంప్యూటర్, స్కానర్, ఆపరేటింగ్ చేయడానికి అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేశారు. మంగళవారం 98 కార్డులు వరకు అప్‌డేట్ చేసినట్లు పోస్ట్‌మాస్టర్ పవన్ తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదింపజేయాలి : రాచేటి


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఉంగుటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళి డిమాండ్‌చేశారు. ఎమ్మార్పీఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేసి, పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్రమోదకుని ఒప్పించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ యు.కిషోర్‌బాబుకి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొలకలూరి ఏసుపాదం, బండ్రపల్లి మధు, కుంపటి బెనర్జీ, మోటుపల్లి నాని, తిరివీధి చిట్టిపండు, ఫ్రాన్సిస్, నిరీక్షణరావు తదితరులు పాల్గొన్నారు.

# సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు


వ్రతంలో పాల్గొన్న బాబు, అరుణ దంపపతులు


దావాజీగూడెంలో వ్రతం చేస్తున్న భక్తులు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు వ్రతాన్ని నిర్వహించారు. వ్రతంలో ఆలయ ట్రస్టీ కాకాని బాబు, అరుణ దంపతులతో పాటు 108 పుణ్య దంపతులు పాల్గొన్నారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఆలయ ట్రస్టీ దంపతులు ఉచితంగా పూజా సామాగ్రిని అందించారు. కార్యక్రమాన్ని ఆలయ ట్రస్టీ తవ్వా పూర్ణచంద్రరావు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం స్వామిరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు స్వామి వారికి విశేషంగా పూజలు,అభిషేకాలు నిర్వహించారు. జంక్షన్‌కు చెందిన మాదల బాబూరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఈవో కె.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

**గన్నవరం:** మండలంలోని దావాజీగూడెం శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయంలో కార్తీక బహుళ ఏకాదశి మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామికి 25వేల తమలపాకులతో విశేష అర్చన జరిగింది. 108 మంది భక్తులచే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామాచార్యులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

**హనుమాన్‌జంక్షన్:** స్థానిక బాపులపాడు గ్రామంలోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జునస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి లక్ష వత్తుల దీపోత్సవం వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గూడవల్లి చిన్నా, వీరమాచినేని నాగయ్య, తమిరి రమేష్,కొల్లి వెంకట్రావు పాల్గొని పర్యవేక్షించారు.

## వీసాల జారీలో జాప్యం తొలగిస్తాం

● అమెరికన్ కాన్సులేట్


**విజయవాడ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** అమెరికా బిజినెస్, టూరిజం వీసాపై అవగాహన సదస్సు మంగళగిరిలోని ఎఫ్‌ట్రానిక్స్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి యూఎస్ కాన్సులేట్ (హైదరాబాద్) జనరల్ చీఫ్ రెబికా డ్రేమ్, జెన్నీ సొకోలిస్కి డిప్యూటీ కాన్సులర్, సూపర్‌వైజర్ ఐశ్వర్యరావత్‌తో పాటు విజయవాడ పరిసర ప్రాంతాలకు చెందిన 40మంది ప్రముఖ పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాన్సులేట్ నిర్వహించే సేవలు, వీసా ప్రాసెసింగ్‌ను రెబికా డ్రేమ్ వివరంగా తెలిపారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియా, అతి పురాతన ప్రజాస్వామ్య దేశమైన అమెరికాల మధ్య ఆర్థిక, సామాజిక సంబంధాలు బాగా అభివృద్ధి చెందాయన్నారు. అమెరికా నుంచి ఇండియాకు వచ్చేవారి సంఖ్య ప్రస్తుతం 300 శాతం అభివృద్ధి ఉందన్నారు. అమెరికా విడుదల చేసే బీ1, బీ2 వీసాల జారీలో జాప్యం జరుగుతోందని వ్యాపార వేత్తలు కాన్సులేట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ జాప్యాన్ని నివారించేందుకు చర్యలు తీసుకొంటున్నామని రెబికా డ్రేమ్ తెలిపారు. హైదరాబాద్ కాన్సులేట్ కార్యాలయంలో గత ఏడాది నుంచి సిబ్బందిని పెంచామని, త్వరలో సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. వీసా కోసం ఇచ్చే సమాచారం నిజాయితీ ఉండాలని, అత్యవసర సమయాల్లో శస్త్రచికిత్స చేయించుకునేందుకు తక్కువ రోజుల్లోనే మంజూరు చేస్తామని జెన్నీ సొకోలిస్కి చెప్పారు. ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ చుక్కపల్లి అవినాష్, ఎఫ్‌ట్రానిక్స్ ఉపాధ్యక్షుడు దాసరి అన్వేష్, ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షురాలు శ్రీదేవి దేవిరెడ్డి పాల్గొన్నారు.

## ఎల్వీప్రసాద్ ఆసుపత్రికి త్రివేణి కళ్లు దానం



**ఉంగుటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** పొరపాటున విషాహారం తిని మృతిచెందిన మండలంలోని ఎలుకపాడు గ్రామానికి చెందిన అజ్మీర త్రివేణి (18) రెం డు కళ్లను సోమవారం ఆమె తల్లిదండ్రులు విజయవాడలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు దానం చేశారు. పొలంలో చల్లిన విషపు మందు ఆహారపదార్థాలపై పడటంతో గమనించకుండా ఆ ఆహారాన్ని తన్ని త్రివేణి విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ఘటనపై ఉంగుటూరు పీఎస్‌లో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదైంది. కాగా త్రివేణి నేత్రాలు దానం చేయటంద్వారా మరో ఇద్దరికి కంటిచూపును ప్రసాదించవచ్చునని భావించిన కుటుంబసభ్యులు ఆమె రెండు కళ్లను దానం చేశారు.

"ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని అజిత్ సింగ్ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి కుటుంబంతో కలిసి ఊరెళ్లారు. ముందుగా ఆయన ఎల్‌హెచ్ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం) ద్వారా వాచ్ పోలీసు రిక్వెస్ట్‌ను నమోదు చేసుకున్నారు. పోలీసులు ఇంటికొచ్చి నలువైపులా సీసీ కెమెరాలు అమర్చారు. తర్వాత ఆయన పని ముగించుకుని ఊరు నుంచి అర్ధరాత్రి ఇంటికొచ్చారు. తలుపు తాళాలు తీసుకుని లోపలకు వెళ్లారు. ఆయన తాళాలు తీస్తుండగానే పోలీసు కంట్రోల్ రూంలో అలారం మోగింది. పోలీసులకు ఎల్‌హెచ్ఎంఎస్ అలర్ట్ వెళ్లింది. వెంటనే పోలీసులు ఇంటిని చుట్టిముట్టారు. లైట్లు వెలిగి ఉండడంతో లోపల నిజంగా దొంగలున్నారేమోనని భావించారు. పోలీసులు తలుపులు కొట్టగా యజమానికి బయటికొచ్చాడు. తానే ఇంటి యజమానినని కొద్దిసేపటి క్రితమే ఊరు నుంచి వచ్చానన్నారు. ఇది కొద్దిరోజుల క్రితం జరిగిన ఘటన."




# పోలీస్ లాక్!

## ఎల్‌హెచ్ఎంఎస్ ద్వారా 33వేలు రిక్వెస్ట్‌ల నమోదు

● ప్రజల్లో అవగాహనకు సదస్సులు
● కమిషనరేట్‌కు 100 సీసీ కెమెరాలు

**ఆంధ్రజ్యోతి, విజయవాడ:** డిసెంబరు నెల వస్తోంది. ఆ నెల మూడోవారం నుంచి సెలవులు మూడ్ వస్తుంది. తర్వాత జనవరిలో సంక్రాంతి సెలవులు. ఇలా ప్రముఖ పండగలు వచ్చినప్పుడు సొంతూళ్లకు వెళ్లడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తారు. ఇక వేసవి సెలవుల్లో విహారయాత్రలకు ప్రణాళికలు వేసుకుంటారు. ఇలాంటి సెలవులను ఆసరాగా చేసుకున్న దొంగల ముఠాలు జిల్లాలోకి అడుగుపెడుతున్నాయి. తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని వరుస చోరీలు చేస్తున్నారు. సెలవుల్లోనే పోలీసులకు ఎక్కువగా చోరీల ఫిర్యాదులు అందుతున్నాయి. ఇలా తాళాలు వేసి ఉన్న ఇళ్ల వైపు దొంగలు చూడకుండా పోలీసులు నిఘా నేత్రాలను అమర్చుతున్నారు. ఒక వేళ ఇంటి గోడ దూకి తాళాలు పగలుగొట్టినా టక్కున దొరికిపోతారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్న దొంగల ముఠాను పట్టుకోవడానికి ఎల్‌హెచ్ఎంఎస్‌ను ఎన్టీఆర్ జిల్లా పోలీసులు ఉపయోగిస్తున్నారు. దీనిపై జిల్లావ్యాప్తంగా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 33వేల మంది ఎల్‌హెచ్ఎంఎస్‌లో రిజిస్టర్ అయ్యారు. దీన్ని లక్షకు పెంచాలని పోలీసు అధికారులున్నారు. ఎల్‌హెచ్ఎంస్ రిక్వెస్ట్‌లు వచ్చినప్పుడు అమర్చడానికి 100 సీసీ కెమెరాలను అందుబాటులో ఉంచారు. ఇంటి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఒక రోజు ముందుగా పోలీసులకు వాచ్ రిక్వెస్ట్ పెట్టాలి. వారం వరకు ఇంటికి ఈ-నిఘా ఉంటుంది. సమయానికి రాలేనప్పుడు పోలీసులకు తెలపాలి. అటువంటప్పుడు 10 రోజుల వరకు నిఘా పెడతారు. ఈ సీసీ కెమెరాలను అమర్చడానికి కమిషనరేట్‌లో ప్రత్యేకంగా టెక్నికల్ టీం పనిచేస్తోంది. మొత్తం రెండు బృందాలు ఇదే పనిలో నిమగ్నమై ఉన్నాయి.

### ఎలా నమోదు చేసుకోవాలి.?

- గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఎల్‌హెచ్ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- యాప్ ఓపెన్ కాగానే రిజిస్టర్, రిక్వెస్ట్ ఫర్ పోలీస్ వాచ్, ఫర్‌గాట్ యూజర్ ఐడీ ఒక దాని కింద ఒకటి ఉంటాయి.
- ముందుగా రిజిస్టర్‌ను క్లిక్ చేసి అందులో వివరాలు పూర్తిచేయాలి.
- పేరు, మొబైల్, జిల్లా, నగరం/పట్టణం, ఇంటి నంబరు, చిరునామా పూర్తి చేయాలి
- తర్వాత గెట్ పై కరెంట్ లొకేషన్‌పై క్లిక్ చేయాలి. వెంటనే అది అక్షాంశ, రేఖాంశాలను ఆటోమెటిక్‌గా తీసుకుంటుంది.
- రిజిస్టర్‌పై క్లిక్‌చేస్తే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది.
- అనంతరం మొబైల్‌కు ఐడీ నంబర్ వస్తుంది.
- దీన్ని యూజర్ ఐడీగా ఉపయోగించుకోవాలి.
- పోలీసు వాచ్‌కు రిక్వెస్ట్ పంపాలనుకున్నప్పుడు ఈ ఐడీ తప్పనిసరిగా నమోదు చేయాలి. (ఉదాహరణకు ఐడీ ఇలా ఉంటుంది. ఏపీ ఎల్‌హెచ్ఎంఎస్ 000000)
- ఒక పాస్‌వర్డ్‌లా భద్రంగా ఉంచుకోవాలి.

### నిఘా రిక్వెస్ట్ ఇలా..!

- యాప్ ఓపెన్ చేయగానే రిజిస్టర్‌కి దిగువన రిక్వెస్ట్ పోలీస్ వాచ్‌పై క్లిక్ చేయాలి.
- ముందుగా యూజర్ ఐడీ ఉన్న కాలమ్‌లో దాన్ని ఎంటర్ చేయాలి.
- స్టార్ట్ డేట్ అని ఉన్న కాలమ్‌లో ఏ రోజు నుంచి ఊరెళ్తున్నారో నమోదు చేయాలి.
- దిగువన స్టార్ట్ టైమ్ అని ఉంటుంది. ఇందులో ఏ సమయానికి ఇంటికి తాళం వేసుకుని వెళ్తున్నారో నమోదు చేయాలి.
- తర్వాత ఎండ్ డేట్ అన్న కాలమ్‌లో ఎప్పటి వరకు ఇంట్లో ఉండరో తేదీ నమోదు చేయాలి.
- అనంతరం ఎండ్ టైమ్ అని ఉన్న చోట ఏ సమయం వరకు ఉండరో తెలిపాలి.
- వివరాలన్నీ నమోదు చేశాక సబ్‌మిట్ వాచ్ రిక్వెస్ట్‌ను క్లిక్ చేయాలి.
- ఈ ప్రక్రియ పూర్తయ్యాక పోలీసు కంట్రోల్ రూం, పోలీస్‌స్టేషన్‌కు అలర్ట్ వెళ్తుంది.
- ఈ అలర్ట్ అందగానే సీసీఎస్‌లోని టెక్నికల్ సిబ్బంది వచ్చి ఇంటిని పరిశీలించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు.
- ఎవరైనా తలుపులు పగలగొట్టినా, ఇంటి ముందు తచ్చాడినా కంట్రోల్ రూం, పోలీస్ స్టేషన్‌కు వెంటనే అలర్ట్ వెళ్తుంది.
- పీసీఆర్‌లోని సిబ్బంది వైర్‌లెస్ సెట్‌లో ఈ సమాచారం చేరవేస్తారు.
- ఆ ఇంటికి సమీపంలోని పెట్రోలింగ్ సిబ్బందితోపాటు పోలీసు స్టేషన్ క్షణాల్లో అక్కడికి చేరుకుంటారు.




# కృష్ణాలో తగ్గిన క్రైమ్ రేటు

● గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు: జిల్లా ఎస్పీ గంగాధరరావు




మహిళా సిబ్బందికి సూచనలు చేస్తున్న కృష్ణాజిల్లా ఎస్పీ

**ఉంగుటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** కృష్ణా జిల్లాలో క్రైమ్ రేటు గతం కంటే బాగా తగ్గిందని, గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు పటిష్టచర్యలు చేపట్టామని కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం రాత్రి మండల కేంద్రమైన ఉంగుటూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. తొలుత సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఆయన పీఎస్ పరిసర ప్రాంతమంతా కలియదిరిగారు. స్టేషన్‌లోని ప్రతిగదిని పరిశీలించి నిర్వహణ విధానాలపై ఆరాతీశారు. అనంతరం రికార్డులు, మూడేళ్ల కంపారేటివ్ స్టేట్మెంట్, స్టేషన్‌మ్యాప్ పరిశీలించి వాటి సమాచారాన్ని డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, ఎస్సై యు.గోవిందును అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. రిసెప్షన్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఫిర్యాదుచేయడానికి వచ్చే ప్రజలపట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల సమస్యలను సానుకూలంగా విని సామరస్యంగా పరిష్కరించాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులను త్వరగా విచారించి ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో పరిష్కారం అందించాలన్నారు. పెండింగ్ కేసుల విచారణను వేగవంతంచేసి కోర్టుకు నివేదిక అందించాలని, జాప్యం చేసే కొద్దీ బాధితులకు న్యాయం అందించలేమన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీట్స్, సస్పెక్ట్ షీట్స్, హిస్టరీ షీట్స్‌ను పరిశీలించి ఎప్పటికప్పుడు వారి ఫొటోలను, వేలిముద్రలను అప్‌డేట్ చేస్తూ, వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. తాళంవేసి ఉన్న ఇళ్లకు రక్షణగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లాక్ట్ హౌస్ మానిటర్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస్)ను ఉపయోగించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలపట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, సైబర్‌నేరాల నియంత్రణకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. పీఎస్ పరిధిలోని గ్రామాల్లో రాత్రిపూట గస్తీని ముమ్మరం చేయాలని, గ్రామస్థులతో మమేకమవుతూ సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఏదైనా సమాచారం ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలపాలని, తద్వారా గ్రామాల్లో అల్లర్లు, గొడవలు జరుగకుండా అదుపు చేయవచ్చన్నారు. అనంతరం సిబ్బందితో ముఖాముఖి నిర్వహించిన ఆయన అందరి ఆరోగ్య పరిస్థితుల గురించి ఆరాతీశారు. రొటేషన్ ప్రకారం సిబ్బందికి విధులు కేటాయించాలని ఎస్సైని ఆదేశించారు. మహిళా పోలీసుల విధులపై సూచనలు చేసిన ఎస్పీ ఇప్పటివరకు అవలంబిస్తున్న విధి విధానాలను మరింత మెరుగుపరచుకుని ప్రజలకు సత్వర న్యాయం అందించేలా కృషిచేయాలన్నారు. డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, ఎస్సై యు.గోవిందు, ఏఎస్సైలు నాగేశ్వరరావు, సత్తార్, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగం అమలులోకి వచ్చి నేటికి 75 వసంతాలు

● సీపీ ఎస్వీ రాజశేఖర్ బాబు

**గుణదల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి నేటికి 75 వసంతాలని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు తెలిపారు. భారత రాజ్యాంగ దినోత్సవం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా డాకర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి సీపీ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949 నవంబరు 26న రాజ్యాంగ సభలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపకల్పన చేసిన రాజ్యాంగాన్ని అంగీకరించడం, శాసనం చేసి అమలు చేయడం జరిగిందన్నారు. రాజ్యాంగాన్ని దేశ ప్రజలతో పాటు తాము గౌరవించి అమలు చేయడంలో చిత్తశుద్ధితో పనిచేస్తామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. దీని వలన సార్వభౌమ్య, సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యముగా దేశ పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, భావప్రకటన, ధర్మం అనేది సమానంగా అందుతుందన్నారు. ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పిస్తున్న సీపీ ఎస్వీ రాజశేఖర్ బాబు



కోర్టు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేందర్, బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్

## కోర్టు క్యాలెండర్-2025 ఆవిష్కరణ

**విజయవాడ లీగల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేందర్ చేతులమీదుగా రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ నేత చలసాని అజయ్‌కుమార్ 2025 కోర్టు క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. హైకోర్టు ఆవరణలో చలసానితో పాటు ఐఏఎల్ న్యాయవాదులు ఎండీ షరీఫ్, బోను జయమ్మ, ఈఎస్ ప్రసాద్, చలసాని వెంకట్ పాల్గొన్నారు. ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది కూడా కోర్టు క్యాలెండర్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని న్యాయస్థానాలకు, న్యాయవాదులకు పంపించడం జరుగుతుందని చలసాని అజయ్‌కుమార్ తెలిపారు.

## నకిలీ అఘోరాలు, సన్యాసులు, పీఠాధిపతులపై కేసులు పెట్టాలి

● గోవిందానంద సరస్వతీ స్వామీజీ

**గన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** ఆంధ్రప్రదేశ్ ధర్మానికి, భక్తికి, సంప్రదాయాలకు, సంస్కృతికి పెట్టిన పేరని అలాంటి గడ్డపై నకిలీ అఘోరాలు, సన్యాసులు, పీఠాధిపతులు తిరుగుతున్నారని, వారిపై కేసులు పెట్టాలంటూ కర్నాటక పంపా క్షేత్ర సాధకులు ద్వారక బద్రి జ్యోతిష్ పీఠం శిష్యుడు గోవిందానంద సరస్వతీ స్వామీజీ అన్నారు. ఆది శంకరులు భగవత్ పాదుల వారు 2500 ఏళ్ల క్రితం ఆంధ్ర వచ్చినప్పుడు ఎలాంటి అనైతిక చూడలేదు. ఇప్పుడు కొంతమంది నకిలీలు తిరుగుతున్నారని వారిని నమ్మవద్దన్నారు. ఆంధ్రరాష్ట్రంలో 5 రోజుల పాటు సంచార యాత్ర కోసం మంగళవారం ఆయన గన్నవరం విమానాశ్రయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తర భారతదేశంలో అఘోరాలు ఎలా ఉంటారో, ఎలా వస్తారో తనకు తెలుసన్నారు.




జ్యోతిర్మయి మఠంలో ఎవరైనా అఘోరా అని చెప్పుకుని తిరుగుతుంటే పచ్చి అబద్ధమన్నారు. వీళ్లపై ప్రజల దృష్టి పడకుండా దుర్గమ్మ, వేంకటేశ్వర స్వామిని భక్తితో కొలవాలన్నారు. 2025లో మహా కుంభం వస్తోందని, దానికి జగద్గురు శంకరాచార్యుల సైన్యం అఘోరాలు, అఖండాలు వస్తారన్నారు. కొంతమంది సన్యాసులు, నకిలీ పీఠాధిపతులుగా తిరుగుతున్నారన్నారు. విశాఖ స్వరూపానేంద్ర లాంటి వారున్నారని తెలిపారు. శృంగేరి నుంచి విధిశేఖర భారతీ పీఠాధిపతి కాదని, కేవలం సన్యాసి మాత్రమేనని, ఆంధ్రలో ప్రజలను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అఘోర, సన్యాసి, పీఠాధిపతులని చెప్పుకుంటూ మోసం చేసే వారిపై 420 సెక్షన్ కింద కేసు పెట్టి కఠినంగా శిక్షించాలన్నారు. జాగృతి రావాలంటే నకిలీలను ప్రశ్నించాలని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేకుంటే సమాజం నందు వీరందరి గుట్టు విప్పుతానని గోవిందానంద సరస్వతీస్వామి పేర్కొన్నారు.



నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడుతున్న కొమ్మారెడ్డి పట్టాభి

## చెత్త నుంచి కరెంట్, బయోగ్యాస్

● స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

**అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** చెత్త నుంచి కరెంట్, బయోగ్యాస్ తయారు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి అన్నారు. మంగళవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. స్టేషన్ నిర్వాహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా రాష్ట్ర వ్యాప్తంగా 85 లక్షల టన్నుల చెత్త నిల్వలను ఎక్కడికక్కడే వదిలివేసిందని మండిపడ్డారు. చెత్త మొత్తం తరలింపు పనులు ముమ్మరంగా చేపట్టామన్నారు. ఒక్క విజయవాడ నగరంలోనే రోజుకు సుమారు 500 నుంచి 600 టన్నుల చెత్తను సేకరించి గుంటూరులోని జిందాల్ కంపెనీకి తరలిస్తున్నట్టు తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్వచ్ఛత విషయంలో దేశంలోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నగరపాలక సంస్థ అధికారులు, తెలుగుదేశం పార్టీ నేతలు పాల్గొన్నారు.

# పార్టీ కోసం ఐక్యంగా పనిచేయాలి

● ఎమ్మెల్యే బొండా ఉమ



ఎమ్మెల్యే బొండా ఉమను గజమాలతో సత్కరిస్తున్న రవికుమార్, సాదం శ్రీనాథ్

**వన్‌టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మెచ్చి వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరుతున్నారని, ఎన్నికల్లో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల్లో ఇప్పటికే నాలుగు పథకాలు అమలు చేస్తున్నామని, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 64వ డివిజన్‌లో వైసీపీకి చెందిన సాదం శ్రీనాథ్, మరికొందరు నేతలతో పాటు సుమారు 250 మందికి పైగా వైసీపీ శ్రేణులు డివిజన్ టీడీపీ నేతలు కాకొల్లు రవికుమార్, పొన్నం శేషగిరిరావు (గిరి) నేతృత్వంలో ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం రాత్రి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కండ్రిక బస్టాప్ వద్ద జరిగిన సభలో ఎమ్మెల్యే వైసీపీ నుంచి వచ్చిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీలో చేరిన వారందరూ పార్టీకి విధేయులుగా పనిచేయాలని సూచించారు. ఇటీవల సంభవించిన వరదల్లో టీడీపీ నేత కె.రవికుమార్ బాధితులకు అండగా నిలిచారని కొనియాడారు. రానున్న రోజుల్లో వైసీపీ నుంచి భారీగా చేరికలు ఉంటాయన్నారు. అందరూ ఐక్యంగా ఉంటూ పార్టీ సభ్యత్వాలు ఎక్కువగా నమోదు చేయాలన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సాదం శ్రీనాథ్, మరికొందరు నేతలు, సీనియర్ నేతలకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కె.రవికుమార్, శ్రీనాథ్ ఎమ్మెల్యేను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. తొలుత పాతపాడు శ్రీకృష్ణ మందిరం నుంచి సుమారు 500 మంది ర్యాలీగా కండ్రిక భవానీ బార్ అండ్ రెస్టారెంట్ సెంటర్ వద్దకు చేరుకుని అక్కడ నుంచి వేదిక వద్దకు ర్యాలీగా వెళ్లారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావటంతో కండ్రిక రోడ్డు పార్టీ శ్రేణులతో కిక్కిరిసింది. స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రామలింగేశ్వరస్వామికి బిల్వార్చన

**విజయవాడ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** యనమలకుదురు, శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామికి ఉదయం 6 నుంచి 10 గంటల వరకు రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశదీపం వెలిగించారు. ప్రధాన అర్చకులు జీఆర్‌వీ సాగర్, దేవస్థానం అర్చకులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సంగా నరసింహారావు ఉచిత ప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్.భవానీ పాల్గొన్నారు.



రామలింగేశ్వర స్వామికి బిల్వార్చన నిర్వహిస్తున్న అర్చకులు

## ఆలిండియా ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నీకి ఏర్పాట్లు

● జాతీయంగా సత్తా చాటుతున్న ఆరు మహిళా టీమ్‌లు

**విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** వాలీబాల్ క్రీడను మ రింత ప్రాచుర్యంలో తెచ్చేందుకు తొలిసారిగా ఇండోర్ స్టేడియంలో ఆలిండియా ఇన్విటేషన్ ఉమెన్ వాలీబాల్ చాంపియన్‌షిప్ (నాదెళ్ల బసవ పూర్ణయ్య)కు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎన్‌బీపీ ట్రస్ట్ చైర్మన్ నాదెళ్ల బ్రహ్మాజీరావు తెలిపారు. ఈ మేరకు ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని వాలీబాల్ కోర్టులో పోటీలకు సంబంధించిన పోస్టర్లను సభ్యులతో కలిసి ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీరావు మాట్లాడుతూ డిసెంబరు 12 నుంచి 15 వరకు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో అత్యాధునికంగా నిర్మించిన ఇండోర్ స్టేడియంలో ఈ టోర్నీ 12న సాయంత్రం 4 గంటలకు, అర్జున అవార్డీ అరికెపూడి రమణరావు, వాలీబాల్ జాతీయ క్రీడాకారులు సాంబశివరావు, గోపీచంద్‌ల పర్యవేక్షణలో ప్రారంభవుతుందన్నారు. ఈ టోర్నీ లీగ్ పద్ధతిలో జరుగుతుందని, సెంట్రల్ రైల్వేస్, బ్యాంక్ ఆఫ్ మహరాష్ట్ర, గుజరాత్ స్పోర్ట్సు హాస్టల్, ఐసీఎఫ్ చెన్నై, సౌత్‌సెంట్రల్ రైల్వే, సదరన్ రైల్వేస్ ఆరు జట్లు బరిలో దిగుతున్నాయన్నారు. విజేతలకు జీఆర్‌జీ ట్రస్ట్ కోయంబత్తూరు సమకూర్చిన రూ.2.75 లక్షల ప్రైజ్‌మనీని అందిస్తామని బ్రహ్మాజీరావు తెలిపారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ దోనేపూడి దయాకరరావు మాట్లాడుతూ రోజు అంతర్జాతీయ ప్రమాణాలతో నాలుగు మ్యాచ్‌లు జరుగుతాయని, ఈ టోర్నీ అందరూ తిలకించి జయప్రదం చేయాలని కోరారు. ట్రస్ట్ సభ్యులు శ్రీనివాసరావు, సాంబశివరావు, మౌనికారావు, డాక్టర్ దేవేంద్ర పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎన్‌బీపీ ట్రస్ట్ చైర్మన్ బ్రహ్మాజీరావు, సభ్యులు

## వాగేష్‌కు సద్గురు సంగీత విద్వన్మణి బిరుదు అందజేత




సద్గురు సంగీత విద్వన్మణి బిరుదు అందుకుంటున్న వాగేష్

**విజయవాడ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** సత్యనారాయణపురంలోని రామకోటి క్షేత్రంలో జరుగుతున్న సద్గురు సంగీత సభ 31వ వార్షిక సం గీత మహోత్సవాల్లో మూడో రోజు మంగళవారం విఖ్యాత గాత్ర విద్వాంసుడు డాక్టర్ కె.వాగీష్‌కు సభ ఏటా ఇచ్చే సద్గురు సంగీత విద్వన్మణి బిరుదు ప్రదానం చేశారు. సభాధ్యక్షుడు టీవీఎస్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పోపూరి గౌరీనాథ్ పాల్గొన్నారు. విఖ్యాత హరికథా విద్వాంసులు ముప్పవరపు సింహాచల శాస్త్రికి హరికథా చతురానన బిరుదు ప్రదానం చేశారు. అనంతరం వాగేష్ గాత్రకచేరీ రక్తిగా సాగింది.

# గుడివాడ

● గుడివాడ ● పామర్రు

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 112, 121, 132 |
| చికెన్ విత్ స్కిన్ | 210 |
| చికెన్ స్కిన్‌లెస్ | 220 |

సెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.595

## దీక్షాపరులకు అన్నదానం



**గుడివాడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) :** వీరాంజనేయస్వామి దేవస్థానంలో దీక్షాపరులకు మంగళవారం అన్నదానం చేశారు. ఆంజనేయస్వామి, అయ్యప్పస్వామి మాలధారులకు దాతలు రాజబోయిన రాజు, శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో సద్ది ఏర్పాటు చేశారు. బాబీ, వీరబాబు, నాగరాజు, సతీష్, సురేష్, వెంకన్న పాల్గొన్నారు.

**బ్రాహ్మణులకు వస్త్రదానం...**

దేవరకొండ నాగన్న బ్రాహ్మణ అన్నదాన సత్రంలో కార్తీకమాస బహుళ ఏకాదశి సందర్భంగా నాగన్న వర్ధంతి నిర్వహించారు. పేద బ్రాహ్మణులకు నూతన వస్త్రాలను పంపిణీ చేసి అన్నప్రసాదం సమకూర్చారు. ఈవో కె.వి గోపాలరావు పాల్గొన్నారు.



## డ్రైన్‌లను శుభ్రపరచాలి

### మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

**గుడివాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** చెత్త సేకరణ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 15,18,24,27 వార్డులు, టిడ్కో కాలనీలో పారిశుధ్య పనులను అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. గుడ్‌మెన్‌పేటలోని వాటర్ ట్యాంకు రోడ్డు ప్రధాన డ్రైయిన్‌ను శుభ్రం చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఆయా వార్డుల శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు, మేస్త్రీలు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.




సదస్సులో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు

## ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

**గుడివాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు కలిగి ఉండాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.శ్రీనివాసరావు అన్నారు. ఏఎన్ఆర్ కళాశాల, కేటీఆర్ మహిళ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాలలో కొత్త ఓటర్ల నమో దుపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కొత్త ఓటర్లు తమ ఓటును విధిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్య ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**గుడివాడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) :** గుడివాడ రైల్వే స్టేషన్ పరిధిలో మంగళవారం మోటూరు-గుడివాడ రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదావశాత్తు రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే ఎస్సై మహబూబ్ షరీఫ్ తెలిపారు. మృతుని ఒంటిపై నీలం రంగు డ్రాయర్, పచ్చ రంగు నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు రైల్వే ఎస్సై సెల్ నెంబరు 94406 27570కు సమాచారం అందించాలని మహబూబ్ షరీఫ్ కోరారు.



మొవ్వ మండలం భట్లపెనుమర్రులో ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళలు



కాటా వేసి నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు



గుడ్లవల్లేరు మండలంలో రోడ్డుపై ధాన్యం ఆరబోస్తున్న రైతులు

# రైతు సేవా కేంద్రాల్లో నామమాత్రపు కొనుగోళ్లు

### ● రోడ్ల పక్కనే ధాన్యం ● రైతులను దోచేస్తున్న దళారులు ● జీపీఎస్ లారీలు, సంచుల కొరత

**రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. వరి నూర్చిన రైతులు వారం రోజుల నుంచి రోడ్లపక్కనే ధాన్యం నిల్వ ఉంచి కాపలా కాయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కొందరు రైతులు ధాన్యాన్ని పగలంతా ఆరబెట్టి సాయంత్రానికి గుట్టలుగా పోగు చేసి కాపలా కాస్తున్నారు. మరికొందరు రైతులు కాటాలు వేసి జీపీఎస్ లారీల దొరకక ఎక్కడి నిల్వలు అక్కడే ఉంచి ఎదురుచూపులు చూస్తున్నారు. తోడు సంచుల కొరత కారణంగా రైతులు అయోమయంలో ఉన్నారు.**

**కూచిపూడి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** రైతుల అవసరాలు దృష్టిలో ఉంచుకుని దళారులు ఇష్టానుసారంగా ధరలు తగ్గించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. పీఏసీఎస్, రైతు సేవా కేంద్రాల అధికారులు దళారులకు సహకరిస్తుండటంతో ధరలు ఇష్టానుసారంగా తగ్గించి రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యం రూ.1740, కామన్ రకం రూ.1725 ధర నిర్ణయించగా, దళారులు మాత్రం రూ.1300 నుంచి రూ.1350 వరకే కొనుగోలు చేస్తున్నారు. పీఏసీఎస్‌లకు, రైతు సేవా కేంద్రాలకు సంచుల కొరత ఉండగా, ధాన్యం వ్యాపారస్తులకు మాత్రం ఆ కొరత ఎక్కడా కనిపించటం లేదు. మండలంలో 14 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించగా, కోసూరు, కాజ, మొవ్వ పాలెం, అయ్యంకి గ్రామాల్లో పీఏసీఎస్‌ల ద్వారా, మిగిలిన పది చోట్ల రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించింది. ప్రభుత్వం ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల ద్వారా 27,779 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఇంతకు మించి దళారులు ధాన్యం కొనుగోలు చేశారు. అయ్యంకి, భట్లపెనుమర్రు, చిన్నముత్తేవి, మొవ్వ, కూచిపూడి, నిడుమోలు, కాజ, కోసూరు, తదితర గ్రామాల్లో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. మధ్య దళారులు కూడా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా బిల్లులు చేయించుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది కొరత, అధికారుల అజమాయిషీ కొరవడటంతో రైతులకు శాపంగా మారి చివరకు అయినకాడికి అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మొవ్వ మండలానికి సంబంధించి మచిలీపట్నం, పామర్రు, కూచిపూడి, దావులూరు, చిట్టూర్పు, వక్కలగడ్డ, చల్లపల్లి ప్రాంతాల్లో గల 20 మిల్లుల వరకు కొనుగోలుకు కేటాయించారు. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా మబ్బులు పడుతుండటంతో రైతులు యంత్రాలపై కోసిన ధాన్యాన్ని ఆరబెట్టకుండా మిల్లులకు పంపటంతో మిల్లర్లు ధాన్యాన్ని తిప్పి పంపిన సంఘటనలు ఉన్నాయి. ప్రభుత్వం తేమ శాతా న్ని 17గా నిర్ణయించగా, 24 నుంచి 27 వరకు తేమ శాతం ఉండటంతో మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయలేకపోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ఆన్‌లైన్ కొనుగోళ్లతో కష్టాలు

**(ఆంధ్రజ్యోతి-గుడ్లవల్లేరు) :** మండలంలో ఈ ఏడాది 22,240 ఎకరాల్లో వరి సాగుచేయగా ఇప్పటి వరకూ 2000 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. 17 రైతు సేవా కేంద్రాల ద్వారా 500 ఎకరాల్లోని 938 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు ఆన్‌లైన్ విధానంలో అమ్మారు. తుపాను కారణంగా రైతాంగం ఒక్కసారే కోతలు కోయడంతో గంటకు రూ3000 తీసుకొనే వరికోత యంత్రం కిరాయి ఇపుడు రూ.3500కు పెరిగింది. ట్రాక్టర్లకూ డిమాండ్ పెరిగింది. దళారులు కేవలం 1350కే కొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ విధానంలో మిల్లులకు ధాన్యం పంపాలంటే జీపీఎస్ ఉన్న ట్రాక్టర్లు, లారీలు కావాలి. నలుదిక్కులూ ఒక్కసారే నూర్పిళ్లు, కోతలు జరుగుతుండడం, తుఫాన్ భయం కారణంగా జీపీఎస్ వాహనాలు దొరకడం లేదు. ఆన్‌లైన్ విధానాన్ని కాకుండా ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేసి రైతులను గట్టెక్కించాలని కోరుతున్నారు

**కలెక్టర్‌తో మాట్లాడా..**

ధాన్యాన్ని కాపాడుకోవాలంటే ఆఫ్‌లైన్ కొనుగోళ్లకు అనుమతించాలని రైతులు కోరుతున్నారు. రైతులు కంగారు పడవద్దు. సమస్యను కలెక్టర్ బాలాజీ దృష్టికి తీసుకెళ్లాను. మార్కెట్ యార్డ్ గోదాముల్లో ఉచితంగా ధాన్యం దాచుకునేందుకు సహకరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

**- వెనిగండ్ల రాము, ఎమ్మెల్యే**

### అధికారులు సమాచారం చెప్పటం లేదు



రైతు సేవా కేంద్రం అధికారులు సరైన సమాచారం చెప్పటం లేదు. 1061 రకం మూడు ఎకరాలు నూర్చి భట్లపెనుమర్రు గ్రామంలో చెరువు పక్కన నిల్వ ఉంచి కాపలా కాయాల్సి కాస్తున్నాం. మిల్లర్లతో మాట్లాడి సంచులు, జీపీఎస్ లారీలు తెచ్చుకుంటే బిల్లు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

**- బొల్లా ఏడుకొండలు, కౌలు రైతు**

### ధాన్యం నూర్చి వారమవుతుంది



ఆరు ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. ధాన్యం నూర్చి వారం రోజులయ్యింది. జీపీఎస్ లారీలు రావటం లేదు. లారీలు ఎప్పుడు వస్తాయో తెలియదని రైతు సేవా కేంద్రం అధికారులు చెబుతున్నారు. చలిలో ధాన్యం కాయాల్సి వస్తుంది. మిల్లులకు ధాన్యం ఎప్పుడు చేరుతుందో తెలియటం లేదు. మధ్య దళారీలు రూ.400 తక్కువగా అడుగుతున్నారు.

**-మొవ్వ చింతయ్య, కౌలు రైతు**



ఆర్డీవో కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు



పెదపారుపూడి తహసీల్దార్ కార్యాలయంలో..

# ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే రక్ష

### ●ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ● మండలాల్లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

**గుడివాడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) :** మేలురకం ప్రజాస్వామిక వ్యవస్థను రూపొందించడంలో అంబేడ్కర్ కృషి అనన్య సామాన్య మైనదని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళరం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి కాకొల్లు భస్కాకరరావు, ఎన్‌టిఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడుయలవర్తి శ్రీనివాసరావు తదితరులు రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొ న్నారు. అంబేడ్కర్ మెమోరియల్ భవన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి ఒన్‌టౌన్ సీఐ కొండ పల్లి శ్రీనివాస్, తాలుకా ఎస్సై చంటిబాబు నివాళులర్పించారు. జిల్లా ఆదిమాంధ్ర సంఘం అధ్యక్షుడు పొంగులేటి జయరాజు, సభ్యులు పాల్గొన్నారు. ఆర్డీవో జి.బాలసుబ్రహ మణ్యం, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస రావు తమ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పిం చారు. ఏఎన్ఆర్ కళాశాలలో పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, అప్పారావు అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సి పాల్ డా.పి.జె.ఎస్.కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ పాల్గొన్నారు.




టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

**బడుగుల కరదీపిక రాజ్యాంగం**

**గుడివాడ రూరల్:** అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం బడుగు, బలహీన వర్గాలకు కరదీపికలాంటిదని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో డివై.విష్ణుప్రసాద్, మండల పరిషత్, సిబ్బంది పాల్గొన్నారు.

**విద్యార్థులకు పోటీలు**

**గుడ్లవల్లేరు :** పెంజంద్ర జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ ప్రసాద్ తదిత రులు రాజ్యాంగంపై అవగాహన కల్పించారు.

**అంబేడ్కర్‌కు నివాళి**

**నందివాడ :** రాజ్యాంగ దినోత్సవాన్ని మం డల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెయ్యేల ఆదాం ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. ఆదాం మాట్లాడుతూ భారతరాజ్యాంగం మనదేశ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం అన్నారు. సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ప్రతిజ్ఞ**

**పెదపారుపూడి:** రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, రీ సర్వే తహసీల్దార్ సుందరరావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లాలి

### రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారుల సమీక్షలో ఎమ్మెల్యే వెనిగండ్ల

**గుడివాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులకు భరోసా కల్పించే విధంగా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించాలని, రైతులను అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రజావేదికలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ఏ మేరకు కోతలు జరిగాయో, కల్లాల్లో ఎంత ధాన్యం ఉందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. తుపాను ప్రభావంతో ఏ ఒక్క రైతుకి ఇబ్బంది కలుగకుండా అధికార యంత్రాం గం అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులకు వద్దకు వెళ్లి అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వెనిగండ్ల కోరారు. తహసీల్దార్ రామకోటేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, వ్యవసాయాధికారులు అనంతలక్ష్మీ, సునీల్, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రైతులు అప్రమత్తం కావాలి : ఏడీఏ




సమావేశంలో ప్రసంగిస్తున్న ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

**గుడివాడ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తం కావాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. గుంటా కోడూరు, కల్వపూడి అగ్రహారం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులు వరి కోతలను నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలని సూచించారు. మిషన్ల ద్వారా కోసిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు చేర్చుకుని ధాన్యం తడవకుండా చూసుకోవాలన్నారు. మండల వ్యవసాయ శాఖాధికారిణి బోలెం అనంతలక్ష్మి పాల్గొన్నారు.

**పెదపారుపూడి :** వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు రైతులకు సూచించారు. రైసు మిల్లర్ల వద్ద పరిమితికి మించి ధాన్యం లోడ్‌లతో ఉండటం వల్ల దిగుమతులు చేయటానికి 2 నుంచి 3 రోజులు పడుతుందని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి 26వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు కోతలు నిలిపివేయాలని కోరారు.



## ఘనంగా అశ్వత్థనారాయణమూర్తి జయంతి

**గుడ్లవల్లేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** ఎ.ఎ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, పాలిటెక్నిక్ కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు అడుసుమిల్లి అశ్వత్థనారాయణమూర్తి జయంతిని పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ నూతన మేనేజింగ్ ట్రస్టీగా వల్లూరుపల్లి రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. వేడుకల్లో 154 మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. రూ.69,000 మేర ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కొడాలి వెంకట కృష్ణారావు, వల్లభనేని సుబ్బారావు, వల్లూరుపల్లి సత్యనారాయణరావు, అడుసుమిల్లి సుబ్రమణ్యేశ్వరరావు, ఉప్పలపాటి సత్యనారాయణ, పొట్లూరి రవికుమార్, ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ మెంటార్ ఎస్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కరుణకుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మణరావు, హైస్కూల్ ప్రిన్సిపాల్ సాతులూరి లీనా, డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, సలహాదారు పొట్లూరి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు కంటి పరీక్షలు**

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పెంజంద్ర, డోకిపర్రు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. పెంజంద్రలో 80 మందికి, డోకిపర్రు హైస్కూల్‌లో 150 మందిని పరీక్షించారు. ఆంధ్రా ఆసుపత్రి కో-ఆర్డినేటర్ డాక్టర్ కామినేని అచ్యుతబాబు ఆర్థిక సహకారంతో కళ్లజోళ్ల అవసమైన వారికి ఉచితంగా పంపిణీ చేయనున్నారు. క్లబ్ అధ్యక్షురాలు ఎస్.శశికళ, మాజీ గవర్నర్ ప్రసాద్, వీరమాచనేని శివప్రసాద్ పాల్గొన్నారు.

## భగవద్గీత పుస్తకాల పంపిణీ

**గుడివాడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) :** టీటీడీ, హిందూ ధర్మపరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యాలయ విద్యార్థులకు డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్, టీటీడీ ధర్మాచార్య కావూరి శ్రీధర్ భగవద్గీత పంపిణీ చేశారు. సుమారు 700 మంది విద్యార్థులకు భగవద్గీతలను అందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడు మూడెడ్ల శ్రీధర్ పాల్గొన్నారు.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 112, 121, 132 |
| చికెన్ విత్ స్కిన్ | 210 |
| చికెన్ స్కిన్‌లెస్ | 220 |
| నెక్ కోడిగుడ్డు ధర (100) | |
| విజయవాడ జోన్ రైతు ధర రూ.595 | |

## రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**అవనిగడ్డ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి బాబూ నాయక్ అన్నారు. అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జాతీయ న్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. న్యాయమూర్తి బాబూ నాయక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి భారతదేశంలో ప్రతి ఒక్కరికీ హక్కులను, బాధ్యతలను అందించిందని, దానిని పరిరక్షించే బాధ్యత ఉన్న న్యాయ వాదులు రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి పని చేయాలని సూచించారు. బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి


పెద వెంకటేశ్వరరావు (ఫైల్)

**నాగాయలంక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** పర్రచివర గ్రామానికి చెందిన మత్స్యకారుడు ఒడుగు పెద వెంకటేశ్వరరావు (55) చేపల వేటకు వెళ్లి మృతి చెందారు. మేకల కాలువ డ్రెయిన్‌లో చేతి వల విసిరి చేపల వేట చేస్తుండగా, ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. ఇంటి రాలేదని అల్లుడు సాయంత్రం వేట ప్రదేశానికి వెళ్లి చూడగా వెంకటేశ్వరరావు చనిపోయి ఉన్నాడు. ఎస్సై కె.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## జాతీయ స్థాయి స్కేట్ పోటీలకు శ్రీచైతన్య విద్యార్థులు

**చల్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కేట్ చాంపియన్‌షిప్ పోటీల్లో చైతన్య స్కూల్ నుంచి 29 మంది విద్యార్థులు పాల్గొనగా ఆరుగురు బంగారు పతకాలు, 16 మంది వెండి పతకాలు, ఏడుగురు రజిత పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డి.సురేష్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విజేతలను ప్రిన్సిపాల్ సురేష్, ఈజీఎం మురళీకృష్ణ, రీజనల్ ఇన్‌ఛార్జి రాజేష్ బాబు, కోచ్ సుబ్బు, జాహ్నవి, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు. **ఘంటసాల :** ఘంటసాల మండలం కొడాలి విజయకుమార్ కుమార్తె మహిత స్కేట్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి సిల్వర్ మెడల్ అందుకుంది.



## బాలలకు ఎమ్మెల్యే మండలి అభినందన

**అవనిగడ్డ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించిన ఈశ్వర్ మార్షల్స్ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అకాడమీ బాలలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అభినందించారు దివిసీమ ఖ్యాతిని జాతీయ స్థాయికి తీసుకువెళ్తున్న ఈశ్వర్, విశ్వలను అభినందించారు. మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.



## చేనేత పితామహుడు కోటయ్యకు ఘననివాళి

**ఘంటసాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య 29వ వర్ధంతిని ఘంటసాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ప్రగడ కోటయ్య విగ్రహానికి రాష్ట్ర పద్మశాలి సంఘం కో-ఆర్డినేటర్ అందె జగదీష్ పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ పద్మశాలి సంఘ నాయకులు వుడతా చిత్తరంజన్ సాయి, అక్కల లీలా ప్రసాద్, మురుగుడు నాంచారయ్య, జంజనం శివరామకృష్ణ, జంజనం రామకృష్ణ, బండారు నాగేశ్వరరావు, నందం వెంకటేశ్వరరావు, చిన్నం ప్రసాద్, పోలన వాసు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు విజయ తేజ



**ఘంటసాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** అండర్-14 జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు శ్రీకాకుళం జడ్పీ హైస్కూల్ విద్యార్థి పులగోరు విజయతేజ ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయురాలు అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి తెలిపారు. శిక్షణ ఇచ్చిన పీడీ బడే వెంకటేశ్వరరావును ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, ఏఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ చిన్నా తదితరులు అభినందించారు.


రహదారికి శంకుస్థాపన చేస్తున్న కూటమి నాయకులు

## గ్రామీణ రోడ్లకు మహర్దశ

**కోడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వంలో గ్రామీణ అభివృద్ధికి తోడ్పడే విధంగా సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయటంతో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ వచ్చిందని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. యర్రారెడ్డిపాలెం 14వ వార్డులో రూ.9.90 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి కూటమి నేతలు శంకుస్థాపన చేశారు. బచ్చు వెంకటేష్, ఉల్లి శేషగిరిరావు, దామెర్ల నారాయణ, వేములపల్లి శ్రీకృష్ణ, మేడా శివాజీ, బడే సాయి, చింతల రమేష్, మహమ్మద్ ఇమ్రాన్, బొడ్డు వెంకన్న, అప్పికట్ల వినోద్, బడే కృష్ణ, పంచాయతీరాజ్ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నసీర్‌ఖాన్‌కు నేతల నివాళి

**పెడన, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** జామియా మస్జిద్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి నసీర్‌ఖాన్ (65) మంగళవారం మృతి చెందారు. పీసీసీ మాజీ సభ్యుడు ఎండి మతీన్, పెడన మునిసిపల్ వైస్‌ఛైర్మన్ ఎండి ఖాజా, మాజీ వైస్‌ఛైర్మన్ కమాల్, మాజీ కౌన్సిలర్ అయూబ్‌ఖాన్, పట్టణ టీడీపీ కార్యదర్శి వహబ్‌ఖాన్, మచిలీపట్నం మునిసిపల్ మాజీ ఛైర్మన్ సిలార్‌దాదా తదితరులు ఆయన భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.


శివరామపురంలో రహదారుల వెంబడి ధాన్యం బస్తాలు


మోపిదేవిలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు


దేవరకోటలో పంట పొలాలను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

# రైతు సేవా కేంద్రాల్లో నామమాత్రపు కొనుగోళ్లు

**● రోడ్లపక్కనే ధాన్యం ● రైతులను దోచేస్తున్న దళారులు ● జీపీఎస్ లారీలు, సంచుల కొరత ● నిబంధనలు సడలించాలంటున్న అన్నదాతలు**

**ఆంధ్రజ్యోతి-మోపిదేవి :** భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు చేస్తుండటంతో ఖరీఫ్ కోతలు కోసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మోపిదేవి, పెదప్రోలు, వెంకటాపురం, శివరామపురం గ్రామాల్లో ఖరీఫ్ వరి కోతలు, నూర్పిళ్లు ప్రారంభమయ్యాయి. వరి పంటను యంత్రాల సహాయంతో కోతలు కోయగా, ధాన్యాన్ని అమ్ముకునే ప్రయత్నాలు చేస్తున్నారు. యంత్రం ద్వారా కోసిన ధాన్యాన్ని వెంటనే అమ్ముకునేందుకు రైతు సేవా కేంద్రాలకు వెళ్లగా, తేమ శాతం మేరకు ధర నిర్ణయిస్తున్నారు. తేమ శాతం ప్రభుత్వం నిర్ణయించిన మేర వచ్చేందుకు నాలుగు నుంచి ఐదు రోజులు ధాన్యాన్ని ఆరబెట్టాల్సి ఉంది. వాతావరణ మార్పులతో అందిన కాడికి అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10 ఎకరాలు కౌలు చేస్తున్న రైతులు వందల కొద్ది బస్తాల ధాన్యాన్ని ఆరబెట్టుకోవటం సాధ్యం కాదని, ప్రభుత్వం నిబంధనలు సడలించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ధాన్యాన్ని జీపీఎస్ సౌకర్యం ఉన్న వాహనాల ద్వారానే ధాన్యాన్ని మిల్లుకు తరలించాలనే నిబంధన మరింత అడ్డంకిగా మారిందంటున్నారు. ఆయా గ్రామాల్లో నూర్పిడి చేసిన ధాన్యం బస్తాలకు సరిపడిన స్థాయిలో మిల్లు యజమాన్యాల నుంచి వాహనాలు ఏర్పాటు చేసేలా అధికారులు చూడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. రెండు రోజుల్లో ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయని పక్షంలో వర్షాలకు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### రైతులు ఆందోళన చెందొద్దు

యంత్రాల ద్వారా నూర్పిడి చేసిన ధాన్యం రైతులు ఏ ఒక్కరూ ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ శాఖాధికారి హెబ్సిబా రాణి తెలిపారు. వెంకటాపురం, శివరామపురం గ్రామాల్లో ఆమె పర్యటించారు. ధాన్యం తేమ 17 నుంచి 24 శాతం వరకు మాత్రం ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం అనుమతితో జీపీఎస్ సౌకర్యం ఉన్న వాహనాల్లో మాత్రమే ధాన్యాన్ని మిల్లులకు రైతు సేవా కేంద్రాల ద్వారా తరలించాలని సూచించారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఏ ఒక్క రైతు కోతలు, నూర్పిడిలు చేయవద్దని తెలిపారు.

### వరి పొలాల పరిశీలన

**ఘంటసాల :** జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశాల మేరకు తహసీల్దార్ బి.విజయప్రసాద్, మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకృష్ణ మండలంలోని వరి పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం మంగళవారం చల్లపల్లి, ఘంటసాల మండలాల్లోని పుచ్చగడ్డ, దేవరకోట గ్రామాల్లోని పలు వరి పొలాలను పరిశీలించారు. డాక్టర్‌డి.సుధారాణి, డాక్టర్ కె.రేవతి, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి రైతులకు సూచనలు చేశారు. **కోడూరు :** కోడూరు, ఉల్లిపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏడీఏ జె.ఎస్.జయప్రద మాట్లాడుతూ, వరి కోతలు డిసెంబర్ 5వ తేదీ తర్వాత పెట్టుకోవాలన్నారు. రైతులు ధాన్యాన్ని రైతు సేవాకేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు. ఏవో ఎం.శ్రీధర్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

### కొనుగోళ్లు వేగవంతం చేయండి

**● అధికారులకు ఎమ్మెల్యే మండలి ఆదేశం**

**అవనిగడ్డ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** వాతావరణ పరిస్థితి నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తహసీల్దార్లు ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. యంత్రాలతో కోసి గ్రామాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతుల సమాచారం వీఆర్‌ఏల ద్వారా తెలుసుకుని, సంచులు రవాణాకు వాహనాలు సమకూర్చి అండగా నిలవాలని ఆదేశించారు. తహసీల్దార్లు ఈ ప్రక్రియను నిరంతరాయంగా పర్యవేక్షిస్తూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.


అరిశేపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న సునీత, అధికారులు


అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి



చల్లపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ కృష్ణకుమారి, అధికారులు

# స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు రాజ్యాంగమిచ్చిన వరాలు

**● రాజ్యాంగ దినోత్సవంలో వక్తలు**

**మచిలీపట్నం టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు భారత దేశ ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన వరాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ జె. సునీత అన్నారు. బందరు మండలం అరిసేపల్లి గ్రామంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో సునీత పాల్గొని ప్రసంగించారు. జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, తలారి సోమశేఖర్, డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్, ఎంపీడీవో వెంకటేష్, అమ్మిరెడ్డి శివయ్య, చండిక పాండురంగారావు, ఉపేంద్ర, లంకే శేషగిరి, లంకే హరికృష్ణ, కుంచే నాని, తలారి సోమశేఖర్ పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవంలో అసెంబ్లీ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీ, కూనపరెడ్డి శ్రీనివాస్, పంతం గజేంద్ర, ధూళిపాళ శ్రీరామ చంద్ర మూర్తి, విన్నకోట సుబ్బారావు, ఎస్. రామకృష్ణ, పెదశింగు శ్రీనివాస్, రిటైర్డు డీఎస్పీ శాయన సుశీల్‌రావు, వై.వి.ఆర్. పాండురంగారావు పాల్గొన్నారు. **ఘంటసాల :** గ్రామపంచాయతీల్లో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. చిట్టూర్పులో సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీ లక్ష్మీ కృష్ణవేణి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. కొడాలిలో సర్పంచ్ చలపాటి రాణి, పంచాయతీ కార్యదర్శి సిహెచ్.వి.ఎస్.నాగమణి, ఉపసర్పంచ్ తుమ్మల శంకరరావు, సిబ్బంది పాల్గొనగా, ఘంటసాలపాలెంలో సర్పంచ్ దోనె రజని, కార్యదర్శి బోలెం అర్జునరావు, తెలుగురావుపాలెంలో సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, కార్యదర్శి బి.అశ్విన్ కుమార్, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. **నాగాయలంక :** భారత రాజ్యాంగం దినోత్సవాన్ని ఎస్సీఎస్టీ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మంచాల తిరుపతి వరప్రసాద్, కందుల శంకర్, తానంకి పోతురాజు, తానంకి వేణు, షేక్ జాని, పొన్నంపల్లి చిన్న, మేడికొండ ప్రకాశరావు, నలుకుర్తి ఆదాము, ఒడుగు దుర్గారావు, చీరాల రాజారావుతో పలువురు పాల్గొన్నారు. **కోడూరు :** అంబేద్కర్ విగ్రహానికి ఎస్సై కె.చాణిక్య నివాళులర్పించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** ఎంపీపీ తుంగల సుమతిదేవి, ఎంపీడీవో మరియదేవి అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. పులిగడ్డ పిచ్చేశ్వరరావు, షేక్ నజీర్ బాషా, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **పెడన:** బల్లిపర్రులో అంబేద్కర్ చిత్రపటానికి వైసీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము నివాళులర్పించారు. బండారు మల్లి, కటకం ప్రసాద్, వన్నెంరెడ్డి మహంకాళరావు, మాదాసు బాబూరావు, బళ్ల గంగయ్య, ఎండి ఖాజా, దావు భైరవలింగం, మలిశెట్టి రాజబాబు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** చల్లపల్లి పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు నివాళులు అర్పించారు. రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి ఎస్సై పి.సుబ్రహ్మణ్యం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **అవనిగడ్డ :** ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తన కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, దిడ్ల ప్రసాద్, యాసం చిట్టిబాబు, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, బండే రాఘవ, కొల్లూరి వాసు, బచ్చు శ్రీహరి, మేడికొండ విజయ్, శోభిల ఏడుకొండలు, యలవర్తి చిన్నా, కొట్టే విజయ్, పాండురంగారావు, కంచర్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక సత్యవ్రతాలు



**నాగాయలంక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** శ్రీరామపాదక్షేత్రం సత్యనారాయణ స్వామి ఆలయంలో ముదునూరి శ్రీనివాస శర్మ, అచ్యుత శర్మ నేతృత్వంలో మంగళవారం సత్యవ్రతాలు నిర్వహించారు. 80 మంది దంపతులు పాల్గొన్నారు. రెండు వేల మందికి అన్నదానం జరిగింది. ఛైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, మండవ బాలవర్ధిరావు, ఉప్పల లీలాకృష్ణ ప్రసాద్, బోయపాటి రాము, తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణ, తలశిల తాతయ్య పాల్గొన్నారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాక్షలతో శివలింగానికి పూజలు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి సహస్ర దీపోత్సవం నిర్వహించారు.

## ఎమ్మెల్యే మండలికి మహిళా పోలీసుల వినతి

**చల్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** సచివాలయ మహిళా పోలీసులు మంగళవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. మహిళా పోలీసులను ఒకే శాఖ కిందకు తీసుకువచ్చి స్పష్టమైన జాబ్‌చార్ట్ ప్రకటించేలా కృషిచేయాలని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు మహిళా పోలీసులు తెలిపారు.

## సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

**అవనిగడ్డ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):** సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీనివాస్ సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డి.ఉమారాణి అధ్యక్షతన సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యాపకులు డాక్టర్ జి.నాగార్జున, ఎం.ఎన్.పరమేశ్వరి, డి.సమత, విద్యార్థులు పాల్గొన్నారు.

## గూడూరులో కార్తీక వనసమారాధన

**గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** గూడూరు రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతన స్వామి, మాజీ సర్పంచ్ పోతన రామోజీ, గోపీ నాగబాబు, ఎన్ఏ బేగ్, రాసంశెట్టి దుర్గారావు, బాసంశెట్టి విజయ్, యారా ప్రసాద్, తోట వేణు, కాట్రగడ్డ కృష్ణ, పుప్పాల సురేష్, చోడగం భిక్షాలరావు, పోతుల రాము, సిరివెళ్ల శ్రీను, గొరిపర్తి బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు. పోతన స్వామి నివాసంలో ఎమ్మెల్యే కాగిత విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి నాటికి గోతులు లేని రోడ్లు లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

## మున్సిపల్ ఆదాయం పెంపునకు చర్యలు

### కౌన్సిల్ అత్యవసర సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్

**పెడన, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :** పెడన మునిసిపాలిటీ ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని తొమ్మిదో వార్డు కౌన్సిలర్ గరికముక్కు చంద్రబాబు డిమాండ్ చేశారు. పెడన మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం వైస్‌ఛైర్మన్ ఎండి ఖాజా అధ్యక్షతన మంగళవారం జరిగింది. 12వ వార్డు కౌన్సిలర్ మట్టా శివపావని మాట్లాడుతూ, పట్టణంలో పారిశుధ్య పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని దుయ్యబట్టారు. కమిషనర్ ఎం. గోపాలరావు మాట్లాడుతూ, వాహనాలు, వర్కర్ల కొరత వల్ల పారిశుధ్యం విషయంలో కొంత వెనుకబడటం జరిగిందన్నారు. మునిసిపల్ కార్యాలయం నుంచి పోయిన ఏసీ తిరిగి ఎలా వచ్చిందని శివపావని ప్రశ్నించగా అధికారులు సరైన సమాధానం చెప్పలేకపోయారు. ఎమ్మెల్యే, ఎంపీల సహకారంతో ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి పట్టణంలోని 23 వార్డులను అభివృద్ధి పరచాలని కౌన్సిలర్ కటకం ప్రసాద్ సూచించారు. గతంలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ఇప్పుడు చేసిన పనులకు బిల్లులు పెట్టడం ఏమిటని కౌన్సిలర్ రహేతున్నీసా ప్రశ్నించారు. అజెండాలోని 17 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. 2024-25 సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌ను, 2025-26 సంవత్సరానికి సంబంధించిన అంచనాల బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిషనర్ ఎం. గోపాలరావు, మేనేజర్ మట్టా ప్రసాద్, టిపిఓ సుజనకుమారి, ఏఈ రామాంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్, ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పామర్తి జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.